JAYABHERIDAILY.COM
జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రభాత జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
మేడ్చల్ - మల్కాజిగిరి | శనివారం 23-05-2026
Medchal - Malkajgiri | Saturday 23-05-2026
Follow: jayabherinews
సంపుటి : 02 | సంచిక : 357
పేజీలు : 8 | వెల : 5
Vol. 02 | Issue 357 | Pages : 8 | ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889 call me
jayabheripaper@gmail.com

## కాళేశ్వరం పవిత్ర దక్షిణ త్రివేణి సంగమం



జయభేరి, జయశంకర్ భూపాలపల్లి :

కాళేశ్వరం తెలంగాణ రాష్ట్రంలోని జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మహాదేవ్‌పూర్ మండలంలో ఉన్న ఒక ప్రాచీన ఆధ్యాత్మిక ప్రాధాన్యమున్న గ్రామం. ఈ గ్రామం ఘనమైన అరణ్య ప్రాంతాల మధ్య, మహానది గోదావరి దాని ఉపనది ప్రాణహిత సంగమస్థలంలో విరాజిల్లుతోంది. తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దులకు సమీపంలో ఉండటం వలన ఈ ప్రాంతానికి ప్రత్యేక భౌగోళిక ప్రాధాన్యం ఏర్పడింది. కాళేశ్వరం హైదరాబాద్‌కు సుమారు 277 కి.మీ. దూరంలో, భూపాలపల్లి పట్టణానికి సుమారు 53 కి.మీ. దూరంలో ఉంది. ఇది కరీంనగర్-మంథని మార్గం ద్వారా వరంగల్-పరకాల మార్గం ద్వారా రహదారి సౌకర్యాలతో అనుసంధానమై ఉంది. సమీప రైల్వే స్టేషన్ మంచిర్యాల, ఇది కాజీపేట-రామగుండం రైల్వే మార్గంలో సుమారు 70 కి.మీ. దూరంలో ఉంది. కాళేశ్వరానికి హిందూ ...మిగతాది 2 లో

## రాజకీయాల కోసం ఆడబిడ్డకు అన్యాయం



- బండి సంజయ్, రేవంత్ రెడ్డి అనుబంధం వల్లనే ఆడబిడ్డకి అన్యాయం
- తమ రాజకీయాల కోసం ఆడబిడ్డకు అన్యాయం చేసిన వెధవ ఎవరో సమాధానం చెప్పాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

జయభేరి, హైదరాబాద్ :

గురువారం ముఖ్యమంత్రి చేసిన అడ్డగోలు వ్యాఖ్యల పైన కేటీఆర్ మండిపడ్డారు. రాష్ట్రంలో ఒక ఆడబిడ్డకు అన్యాయం జరిగిందని బయటకు వస్తే ఆ కుటుంబాన్ని బెదిరించి కౌంటర్ కేస్ పెట్టించి, నిందితుడిని తొమ్మిది రోజులు కాపాడింది ముమ్మాటికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డినే అన్నారు. మైనర్ బాలిక తనకు అన్యాయం జరిగిందని తల్లిదండ్రులతో పోలీస్ స్టేషన్కు వెళ్తే అర్ధరాత్రి వరకు నిలబెట్టి, తీవ్ర ఆవేదనకి గురిచేసింది రాష్ట్ర ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు. బండి సంజయ్, రేవంత్ రెడ్డి కలిసి తొమ్మిది రోజుల పాటు నిందితుణ్ణి కాపాడారని కేటీఆర్ ఆరోపించారు. కేవలం రాష్ట్ర హైకోర్టు బెయిల్ ఇవ్వనని తెగేసి చెప్పడం, తెలంగాణలోని ప్రతి ఒక్క ఆడబిడ్డ ప్రభుత్వాన్ని పైన దుమ్మెత్తి పోయడంతోనే సిగ్గు తెచ్చుకొని, చివరికి దిక్కులేని పరిస్థితుల్లో నిందితుణ్ణి అరెస్ట్ చేశారని కేటీఆర్ అన్నారు. రాష్ట్ర హోంశాఖకు బాధ్యుడిగా ఉన్న ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి పర్యటన వల్ల పోలీసులంతా బిజీ ఉన్నారు అని అడ్డగోలు సాకులు చెప్పేందుకు చెప్పినందుకు సిగ్గుపడాలన్నారు. ముఖ్యమంత్రి చెప్పిన మాటలను కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. 'ప్రధానమంత్రి వస్తే మూడు రోజుల పాటు రేవంత్ రెడ్డి చంచల్గూడలో గడిపిన సన్నిహితులు బయట అడ్డగోలుగా నేరాలు చేయవచ్చా? అలాంటి కారణాలు ...మిగతాది 2 లో

## ఐఏఎస్ పిల్లలకు రిజర్వేషన్లు ఎందుకు

- సుప్రీం కోర్టు సూటి ప్రశ్న



జయభేరి, న్యూఢిల్లీ, మే 22 :

రిజర్వేషన్ల ప్రయోజనాలు పొంది విద్యాపరంగా, ఆర్థికంగా ఉన్నత స్థాయికి చేరిన కుటుంబాలకు ఇంకా కోటా ఎందుకని సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు చేసింది. వెనుకబడిన తరగతుల్లోని 'క్రీమీ లేయర్' మినహాయింపులపై దాఖలైన ఓ పిటిషన్ విచారణ సందర్భంగా దేశ అత్యున్నత న్యాయస్థానం శుక్రవారం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. సమాజంలో ఒకసారి ఆర్థిక, సామాజిక ఎదుగుదల వచ్చాక కూడా మళ్లీ రిజర్వేషన్లు కోరడాన్ని కోర్టు తప్పుబట్టింది. "తల్లిదండ్రులు ఇద్దరూ ఐఏఎస్ అధికారులు అయితే, వారి పిల్లలకు ఇంకా రిజర్వేషన్లు ఎందుకు? విద్యాపరమైన, ఆర్థికపరమైన ...మిగతాది 2 లో

## అధికారంలోకి రాగానే ఫ్యూచర్ సిటీ రద్దు



జయభేరి, హైదరాబాద్, మే 22 :

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ఫ్యూచర్ సిటీ' ప్రాజెక్ట్‌పై బీఆర్ఎస్ కీలక నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న ఆయన అక్కడ జరిగిన ఓ కార్యక్రమంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని ప్రకటించారు. ఈ వ్యాఖ్యలు ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో ప్రాధాన్యం సంతరించుకున్నాయి.గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన 'ఫార్మా సిటీ'ని మళ్లీ పునరుద్ధరిస్తామని హరీశ్ తెలిపారు. ఫార్మా సిటీ కోసం తాము 16 వేల ఎకరాల భూసేకరణ చేశామన్నారు. దానికి కేంద్ర పర్యావరణ శాఖ నుంచి అన్ని క్లియరెన్సులు కూడా వచ్చాయని వెల్లడించారు. ఏ ఉద్దేశంతోనైతే రైతుల దగ్గర నుంచి భూములు తీసుకున్నామో దానికి భిన్నంగా భూమిని వేరే అవసరాల కోసం వాడితే ఆ ల్యాండ్‌ను తిరిగి రైతులకే ఇచ్చేయాలని చట్టం చెబుతోందని తెలిపారు. ఫార్మా సిటీని రద్దు చేసి వేరే ప్రాజెక్ట్ పెడితే చట్ట ప్రకారం ...మిగతాది 2 లో




- బీజేపీ ప్రతిపాదించిన 50% సీట్ల పెంపు కేవలం ఒక భ్రమ అని, అది దక్షిణాది సీట్ల శాతాన్ని కాపాడలేదని చిదంబరం విశ్లేషించారు
- దక్షిణాది రాష్ట్రాలు నష్టపోకుండా ఉండేందుకే ఎన్డీయే ప్రభుత్వం డీలిమిటేషన్ బిల్లు ద్వారా సీట్ల సంఖ్యను దామాషా పద్ధతిలో పెంచాలని ప్రయత్నించిందని లోకేష్ పేర్కొన్నారు

జయభేరి, విజయవాడ, మే 22 :

నియోజకవర్గాల పునర్విభజన అంశంపై మాజీ కేంద్ర ఆర్థిక మంత్రి పి. చిదంబరం , ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేష్ మధ్య జరిగిన ఎక్స్ యుద్ధం చర్చనీయాంశమైంది. డీలిమిటేషన్ వల్ల దక్షిణ భారతదేశ ప్రాతినిధ్యం తగ్గిపోతుందన్న ఆందోళన తో రాజ్యాంగంలోని అధికరణం 81, 1971 జనాభా లెక్కల ప్రాతిపదికను ఉటంకిస్తూ ఈ వాదోపవాదాలపై పలువురు తమ వాదన వినిపిస్తున్నారు. నియోజకవర్గాల పునర్విభజన తర్వాత లోక్‌సభలో దక్షిణాది రాష్ట్రాల బలం తగ్గిపోతుందంటూ ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో లోకేష్ చేసిన వ్యాఖ్యలపై చిదంబరం స్పందిస్తూ విమర్శలు గుప్పించారు. నా యువ మిత్రుడు నారా లోకేష్ కొంచెం లెక్కలు సరి చూసుకోవాలి అంటూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 81ని మార్చకుండా పునర్విభజన చేపడితే, ఉత్తరాది రాష్ట్రాల జనాభా ప్రాతిపదికన వాటి సీట్లు పెరుగుతాయని, తద్వారా దక్షిణాది రాష్ట్రాల సాపేక్ష బలం దెబ్బతింటుందని ఆయన వాదించారు. బీజేపీ ప్రతిపాదించిన 50% సీట్ల పెంపు కేవలం ఒక భ్రమ అని, అది దక్షిణాది సీట్ల శాతాన్ని కాపాడలేదని చిదంబరం విశ్లేషించారు. చిదంబరం ట్వీట్‌కు నారా లోకేష్ అంతే దీటుగా సమాధానమిచ్చారు. రాజ్యాంగం ప్రకారం 1971 జనాభా లెక్కల ఆధారంగా ఉన్న సీట్ల స్తంభన 2026 తర్వాత జరిగే మొదటి జనాభా లెక్కల అనంతరం ముగుస్తుందని గుర్తు చేశారు. ఈ స్తంభన తొలగిన తర్వాత నియోజకవర్గాల మార్పు అనివార్యమని, అప్పుడు దక్షిణాది రాష్ట్రాలు నష్టపోకుండా ఉండేందుకే ఎన్డీయే ప్రభుత్వం డీలిమిటేషన్ బిల్లు ద్వారా సీట్ల సంఖ్యను దామాషా పద్ధతిలో పెంచాలని ప్రయత్నించిందని పేర్కొన్నారు. ఇంతటి మేధావి అయిన మీకు ఈ విషయం తెలియదా దక్షిణాది ప్రయోజనాలను పణంగా పెట్టి కాంగ్రెస్ ఎందుకు ఈ బిల్లును వ్యతిరేకించింది అంటూ లోకేష్ ఎదురుదాడికి దిగారు.లోకేష్ కౌంటర్‌కు షర్మిల స్పందించారు. నారా లోకేష్ కన్ఫ్యూజన్ క్రియేట్ చేస్తున్నారని ఆరోపించారు. ...మిగతాది 2 లో

## రాజ్యసభ ఎన్నికల షెడ్యూల్ విడుదల



జయభేరి, న్యూఢిల్లీ, మే 22 :

ఖాళీ అవుతున్న రాజ్యసభ స్థానాల భర్తీకి కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను విడుదల చేసింది. జూన్, జులై నెలల్లో పదవీకాలం ముగియనున్న 10 రాష్ట్రాల్లోని మొత్తం 24 రాజ్యసభ స్థానాలకు ఈ ఎన్నికలు జరగనున్నాయి. ఇందులో ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన 4 కీలక స్థానాలు కూడా ఉన్నాయి. ...మిగతాది 2 లో

## మేడ్చల్ డిప్యూటీ కలెక్టర్ నివాసాల్లో ఏసీబీ సోదాలు

- భారీగా ఆస్తులు గుర్తింపు



జయభేరి, హైదరాబాద్, మే 22 :

మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా డిప్యూటీ కలెక్టర్ వంశీమోహన్ నివాసాల్లో ఏసీబీ సోదాలు నిర్వహించింది. ఆదాయానికి మించి ఆస్తుల కేసు నమోదు చేసి ఆయనకు చెందిన ఎనిమిది ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఏసీబీ అధికారులు వందల కోట్ల రూపాయల విలువైన ఆస్తులను గుర్తించారు. శేరిలింగంపల్లి, ఇతర ప్రాంతాల్లో ఆర్డీవోగా పనిచేసిన వంశీమోహన్ పెద్ద ఎత్తున ప్రభుత్వ భూములు కాజేసినట్లు ఆరోపణలు వచ్చాయి.అబ్దుల్లాపూర్ మెట్ , పిగ్లీపురంలో 8 ఎకరాల ప్రభుత్వ భూమిని కాజేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. భూములను తన మామ పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించి ఆ తర్వాత రియల్టర్లకు ధారాదత్తం చేసినట్లు అధికారులు గుర్తించారు. ఒక రియల్టర్ నుంచి 10 ప్లాట్లు గిఫ్ట్ డీడ్ చేయించుకున్నట్లు ఏసీబీ గుర్తించింది. దీంతో అధికారులు ఆదాయానికి మించి ఆస్తుల కేసును నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## జూన్ 2 నుండి పంపిణీ

- కొత్త పెన్షన్ల మంజూరుపై ప్రభుత్వం కీలక ప్రకటన...



జయభేరి, హైదరాబాద్, మే 22 :

తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కొత్త పెన్షన్లు.. ఇందిరమ్మ ఇళ్లు.. రేషన్ కార్డుల కోసం నిరీక్షిస్తున్న వారికి తీపి కబురు అందించింది. ఇప్పటికే వీటి కోసం ...మిగతాది 2 లో



## నిందితుడు అరెస్టు

- ఏటీఎం నగదు వాహనం దొంగతనం

జయభేరి, హైదరాబాద్ :

సుల్తాన్ బజార్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏటీఎం వద్ద నగదు రవాణా వాహనం దొంగతనం కేసును పోలీసులు 48 గంటల్లోనే ఛేదించినట్లు ఖైరతాబాద్ జోన్ డీసీపీ శిల్పవల్లి తెలిపారు. ...మిగతాది 2 లో

## ఉప్పల్‌లో సన్‌రైజర్స్ జయభేరి

- ఉప్పల్‌లో ఉతికేసిన ఇషాన్, క్లాసెన్..


...మిగతాది 2 లో

మొదటిపేజీ తరువాయి

## ఆడబిడ్డకు అన్యాయం

చెప్పడానికి ప్రభుత్వానికి సిగ్గున్నదా?' అని కేటీఆర్ ప్రశ్నించారు. అత్యంత సున్నితమైన బాలిక విషయంలో పార్టీ తరపున మౌనంగా ఉన్నామని, ఏనాడూ రాజకీయం చేయలేదని కేటీఆర్ తెలిపారు. కానీ ఈ రోజు ముఖ్యమంత్రి మా పైన విమర్శలు చేసిన తర్వాతనే తప్పని పరిస్థితుల్లో ఈ అంశం పైన మాట్లాడాల్సి వస్తున్నదని కేటీఆర్ తెలిపారు. ముఖ్యమంత్రి ఒక పోక్సో (POCSO) కేస్ నిందితుడిని తొమ్మిది రోజులు దాచిపెట్టిన సందర్భం దేశంలో ఎక్కడైనా ఉన్నదా అన్న విషయం పైన స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేవలం కేంద్రమంత్రి బండి సంజయ్కు, రేవంత్ రెడ్డికి ఉన్న అనుబంధం వల్లనే ఇద్దరు కలిసి నిందితుణ్ణి తొమ్మిది రోజులు దాచి ఉంచారని కేటీఆర్ అన్నారు. ముఖ్యమంత్రి సన్నిహితుడి ఆసుపత్రిలో తొమ్మిది రోజుల పాటు దాసపెట్టినారన్న వార్తలు వస్తున్నాయని, దీనిపైన ప్రభుత్వం విచారణ చేయాలన్నారు. ఆడబిడ్డకు అన్యాయం జరిగిందని బయటకు వస్తే ఆ అమ్మాయి కుటుంబం పైననే 'హనీ ట్రాప్' అంటూ కౌంటర్ కేస్ పెట్టి కుట్ర చేయించిన వెధవ ఎవరో చెప్పాలని బండి సంజయ్కు, ముఖ్యమంత్రికి కేటీఆర్ సవాలు విసిరారు.

బండి సంజయ్ కొడుకు తనకు సంబంధం లేదని కోర్టు ద్వారా ఆర్డర్ తెచ్చుకున్నాడని, అంతటి దుర్మార్గమైన పరిస్థితి ఏ తండ్రికి రావద్దని కేటీఆర్ అన్నారు. ఈ మొత్తం పోక్సో కేసు విషయంలో హనీ ట్రాప్ అంటూ అడ్డగోలు వార్తలు రాసిన మీడియా, రాయించిన వ్యక్తులు ఎవరో, వ్యక్తులు ఎవరో సమాధానం చెప్పాలని కేటీఆర్ అన్నారు. స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్రమంత్రి బండి సంజయ్లు మీడియా కార్యాలయాలకు ఫోన్ చేసి కాళ్లా వేళ్లా పట్టుకొని వార్తలు రాకుండా ఆపింది వాస్తవం కాదా అని కేటీఆర్ ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎక్కడ ఆడబిడ్డలకు అన్యాయం జరిగినా కొట్లాడింది తామే అని, అది లగచర్ల నుంచి మొదలుకొని అనేక అంశాల్లో మా పార్టీ తరపున కొట్లాడుతున్నామని కేటీఆర్ అన్నారు.

బండి సంజయ్తో తనకు ఎలాంటి పంచాయితీ లేదు అని, బండి సంజయ్ తన తండ్రి గురించి అడ్డగోలుగా మాట్లాడినా ఏ రోజు నేను స్పందించలేదని కేటీఆర్ తెలిపారు. ఈ రోజు కూడా బండి సంజయ్ను ఏమనడం లేదని, కేవలం నేరస్థుడు ఎవడైనా నేరస్థుడే అనే ఆలోచనతోనే మాట్లాడుతున్నామని కేటీఆర్ అన్నారు. బండి సంజయ్ మాదిరిగా తన కొడుకుకి తన తండ్రికి సంబంధం లేదని చెప్పుకునే పిరికివాణ్ణి కాదని, మా నాన్న పేరు కేసీఆర్, నా కొడుకు పేరు హిమాన్షు అంటూ కేటీఆర్ గట్టిగా కౌంటర్ ఇచ్చారు. పోక్సో కేసు విషయంలో జరుగుతున్న అన్యాయం పైన ప్రశ్నిస్తే 'మా బావమరిది ఇంటి పైన డ్రగ్స్ దాడి జరిగింది' అంటూ అడ్డగోలుగా మాట్లాడుతున్న రేవంత్ రెడ్డి, కేసు ఎందుకు పెట్టడం లేదు అని, దమ్ముంటే కేసు పెట్టి విచారణ చేయించాలని డిమాండ్ చేశారు.

## నారా లోకేశ్ వర్సెస్ చిదంబరం

ఈ చర్చ అంతా ఆర్టికల్ 81 చుట్టూ తిరుగుతోంది. జనాభా నియంత్రణ పాటించిన దక్షిణాది రాష్ట్రాల కంటే, జనాభా పెరిగిన ఉత్తరాది రాష్ట్రాలకు ఎక్కువ ఎంపీ సీట్లు దక్కడం వల్ల పార్లమెంటులో దక్షిణాది వాయిస్ తగ్గిపోతుందనేది ప్రధాన ఆందోళన. చిదంబరం వాదన ప్రకారం.. ఏపీకి సీట్లు పెరిగినా దేశవ్యాప్తంగా పెరిగే సీట్లతో పోలిస్తే దక్షిణాది వాటా తగ్గుతుంది. అసలు పునర్విభజన బిల్లునే వ్యతిరేకించడం వల్ల కాంగ్రెస్ దక్షిణాదికి ఎలా మేలు చేస్తుందో చెప్పాలని డిమాండ్ చేశారు.ఈ ట్వీట్ల యుద్ధం కేవలం ఇద్దరు నేతల మధ్య జరిగిన చర్చ మాత్రమే కాదు, ఎన్డీయే కూటమిలో కీలక భాగస్వామిగా ఉన్న టీడీపీ, దక్షిణాది ప్రయోజనాల విషయంలో రాజీ పడబోమని చెబుతూనే, కేంద్రం ప్రతిపాదించిన మెకానిజమే పరిష్కారమని నమ్ముతోంది. మరోవైపు, కాంగ్రెస్ పార్టీ ఈ బిల్లులోని మేథమెటికల్ ఇల్యూజన్ ను ఎత్తిచూపుతూ దక్షిణాది ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తోంది.

## త్రివేణి సంగమం

పురాణాలలో విశిష్టమైన స్థానం ఉంది. స్కంద పురాణంలోని కాళేశ్వర ఖండం ఈ పుణ్యక్షేత్ర మహిమను, పవిత్రతను విశదీకరిస్తుంది. పురాణాల ప్రకారం, త్రేతాయుగంలో శ్రీరాముడు దండకారణ్యంలో వనవాసం చేస్తున్న సమయంలో ఈ ప్రాంతం గుండా ప్రయాణించినట్లు రామాయణం పేర్కొంటుంది. ఈ ప్రాంత పరిసరాలలోని ప్రాచీన శ్రీరామాలయాలు ఆ విశ్వాసాన్ని మరింత బలపరుస్తున్నాయి.

ఈ గ్రామం గోదావరి నది ఎడమ తీరంలో, గోదావరి-ప్రాణహిత సంగమ స్థలంలో వెలసిన ప్రసిద్ధ శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవాలయానికి పేరుగాంచింది. భక్తుల విశ్వాసం ప్రకారం, అంతర్వాహినిగా సరస్వతి నది ఇక్కడ భూగర్భంలో ప్రవహిస్తుందని చెబుతారు. అందువల్ల ఈ సంగమాన్ని దక్షిణ త్రివేణి సంగమం దక్షిణ కాశి గా గౌరవిస్తారు. స్కంద పురాణం ప్రకారం, యమ ధర్మరాజు (కాలుడు) దక్షిణ దిక్కుకు అధిపతిగా, అష్టదిక్పాలకులలో ఒకరిగా, ఈ పవిత్ర క్షేత్రంలో పరమశివుని ఆరాధిస్తూ ఘోర తపస్సు చేశాడు. ఆయన భక్తికి ప్రసన్నుడైన పరమశివుడు, తనతో పాటు నిత్యం ఇక్కడే నివసించే వరాన్ని యమునికి అనుగ్రహించాడు. అందుచేత ఈ దేవాలయంలో ఒకే పానవట్టంపై కాళేశ్వర ముక్తీశ్వర అనే రెండు శివలింగాలు ప్రతిష్ఠించబడ్డాయి. ఈ స్వామిని కాళేశ్వర ముక్తీశ్వర స్వామిగా ఆరాధిస్తారు. ఇది కాలం (మరణం) మోక్షం (విముక్తి)లకు ప్రతీకగా భావించబడుతుంది. తెలుగు రాష్ట్రాలలో యమధర్మరాజు శివలింగ రూపంలో పరమశివునితో కలిసి ఆరాధించబడుతున్న ఏకైక ఆలయం ఇదేనని విశ్వసిస్తారు.

యముడు కాలుడు అనే పేరుతో ఇక్కడ లింగరూపంలో కొలువై ఉండటంతో ఈ క్షేత్రానికి కాళేశ్వరం అనే పేరు ఏర్పడింది. ఇక్కడి శివలింగాలలో ఒకదానిపై రెండు చిన్న రంధ్రాలు ఉంటాయి. వీటిని స్వామివారి నాసికా రంధ్రాలుగా భావిస్తారు. ఈ రంధ్రాలలో పోసిన పాలు లేదా నీరు గోదావరి నదిలో కలుస్తాయని స్థానిక విశ్వాసం. కాళేశ్వరం గోదావరి నదీ తీరంలోని పవిత్ర స్నాన ఘాట్లకు కూడా ప్రసిద్ధి చెందింది.

వీటిని అష్ట తీర్థాలు అని పిలుస్తారు. అవి బ్రహ్మ తీర్థం, పిచ్చుక తీర్థం, జ్ఞాన తీర్థం, వాయస తీర్థం, సంగమ తీర్థం, నరసింహ తీర్థం, హనుమత్ తీర్థం, వ్యాస తీర్థం. ముఖ్యమైన పుణ్యకాలాల్లో హిందూ పండుగల సందర్భంగా వేలాది మంది భక్తులు ఇక్కడ పవిత్ర స్నానాలు ఆచరిస్తారు. కాళేశ్వరం పరిసర ప్రాంతాలలోని దేవాలయాల నిర్మాణం మరియు పునర్నిర్మాణాలకు కాకతీయ పాలకులు చేసిన సేవలను అనేక శాసనాలు తెలియజేస్తున్నాయి. విజయనగర సామ్రాజ్యానికి చెందిన దేవరాయల 1397 శాసనం ప్రకారం, కాళేశ్వరంలో దిగ్విజయోత్సవాన్ని నిర్వహించి తులాపురుష దానం చేసినట్లు పేర్కొనబడింది.

కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1976లో విస్తృతంగా పునరుద్ధరించింది. ఆలయ ప్రాచీనతను, అసలు శివలింగాల పవిత్రతను కాపాడుతూ ఈ పనులు నిర్వహించబడ్డాయి. అనంతరం 1982లో కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు శంకరాచార్య స్వాములు ఆలయాన్ని పునఃప్రతిష్ఠ చేశారు. కాళేశ్వరం తన విశిష్ట శిల్ప సంపదకు కూడా ప్రసిద్ధి చెందింది. ముఖ్యంగా విష్ణుమూర్తి దశావతార శిల్పాలలో మత్స్య మరియు కూర్మ అవతారాల శిల్పాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. అదనంగా అన్నపూర్ణాదేవి, శైవ ద్వారపాలకులు, మత్స్యయంత్రాన్ని లక్ష్యంగా చేసుకున్న అర్జునుడు, చతుర్ముఖ లింగం వంటి శిల్పాలు కూడా ఎంతో ప్రాముఖ్యత కలిగి ఉన్నాయి. ఈ శిల్పాలు రాష్ట్రకూట, వేములవాడ చాళుక్య, కళ్యాణి చాళుక్య కాకతీయుల కాలాలకు చెందినవిగా భావించబడుతున్నాయి. ఎర్రరాయి, గ్రానైట్, బసాల్ట్ రాళ్లతో చెక్కబడిన ఈ శిల్పాలను ఆలయ సమీపంలోని మ్యూజియంలో భక్తులు సందర్శకుల కోసం ప్రదర్శిస్తున్నారు. గోదావరి నది దక్షిణ తీరంలో ఉన్న ధర్మపురి, కోటిలింగాల, మంథని వంటి చారిత్రక పవిత్ర ప్రాంతాలు కాళేశ్వరానికి సమీపంలో ఉన్నాయి. ముఖ్యంగా హిందూ పండుగల సమయంలో ఈ ప్రాంతాలు భక్తులను, పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తాయి.కాళేశ్వరం ఆధ్యాత్మికత, పురాణ ప్రాశస్త్యం, చరిత్ర, శిల్పకళ మరియు ప్రకృతి సౌందర్యాల సమ్మేళనంగా నిలుస్తోంది. దక్షిణ కాశిగా ప్రసిద్ధి చెందిన శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి క్షేత్రం, గోదావరి తీరం మీద శతాబ్దాలుగా కొనసాగుతున్న ఆధ్యాత్మిక సంప్రదాయాలను సాంస్కృతిక వారసత్వాన్ని నేటికీ కాపాడుతూ భక్తులను, పర్యాటకులను ఆకర్షిస్తోంది.

# జెన్-జెడ్ ఉద్యమంగా కాక్రోచ్ జనతా పార్టీ




ఒక వ్యక్తికి వచ్చే కోపం.. పదిమందికి వస్తే అది ఉద్యమంగా మారుతుంది. ఆ తర్వాత అనేక గళాలు దానికి తోడైతే అప్పుడు దాన్ని తీవ్రత మారిపోతూ ఉంటుంది. ఇటువంటి ఉద్యమాలు ఈ ప్రపంచంలో చాలా జరిగాయి. చాలా మార్పులకు కారణమయ్యాయి. వ్యక్తులను దించేశాయి. వ్యవస్థలను మార్చేశాయి. నిద్రాణమైన సమాజాన్ని చైతన్యవంతం చేశాయి. అందుకే ఆగ్రహం అనేది ఒక వ్యక్తిలో అర్థవంతంగా కలిగితే కచ్చితంగా అది వ్యవస్థను మారుస్తుందని నిపుణులు అంటుంటారు. మనదేశంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నిరుద్యోగ యువతను బొద్దింకలుగా పోల్చారు. ఆ తర్వాత సోషల్ మీడియాలో ప్రచారం వేరే విధంగా మొదలైంది. కాక్రోచ్ అని సూర్యకాంత్ చేసిన వ్యాఖ్యలు జనరేషన్ జెడ్ లో ఆగ్రహాన్ని కలిగించాయి. ఆ తర్వాత సామాజిక మాధ్యమాలలో క్యాంపెయిన్ మొదలైంది. ఆ ఉద్యమం ఇప్పుడు ప్రకంపనలకు దారితీస్తోంది.. ఏకంగా కాక్రోచ్ జనతా పార్టీ ఏర్పాటయింది. కాకపోతే అది సోషల్ మీడియాలో మాత్రమే. ఈ పార్టీకి వ్యవస్థాపకుడిగా అభిజిత్ దీప్కే సోషల్ మీడియాలో ఇప్పుడు ఎక్కడ చూసినా ఒకటే పేరు వినిపిస్తోంది. అదే కాక్రోచ్ జనతా పార్టీ. ఈ సెటైరికల్ వెబ్ సైట్ కొద్దిరోజుల్లోనే 'బొద్దికల పార్టీ'గా భారతదేశంలోని సోషల్ మీడియాలో సంచలనాలు నమోదు చేస్తోంది. అభిజిత్ దీపక్ అనే వ్యక్తి కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు, కన్వీనర్ అని ఆ పార్టీ వెబ్ సైట్ చూపుతోంది. అయితే, ఇది ఇన్స్టాగ్రామ్ లో సరికొత్త సంచలనాలు నమోదు చేస్తుంది. ఒక పార్టీ అధికారంలోకి రావాలంటే జనాలు ఓట్లు వేయాలి.. ప్రత్యర్థి పార్టీకి మించి ఓట్లు వస్తేనే అధికారాన్ని దక్కించుకోవడానికి సాధ్యమవుతుంది. అలాకాకుండా కేవలం సోషల్ మీడియాలో ఫాలోవర్స్ ను చూసి అధికారంలోకి వస్తామనుకుంటే అంతకు మించిన భ్రమ ఇంకొకటి ఉండదు. సోషల్ మీడియా ప్రామాణికమైతే ఇన్స్టాగ్రామ్ లో విరాట్ కోహ్లీకి 100 మిలియన్లకు పైగా ఫాలోవర్స్ ఉన్నారు. అలాంటప్పుడు ఆయన మన దేశానికి ప్రధానమంత్రి కావాలి కదా..కొంతమంది ఏదో ఆగ్రహంలో పెట్టిన కాక్రోచ్ జనతా పార్టీ.. ఇప్పుడు సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. ఏకంగా బిజెపి పార్టీకి మించిన ఫాలోవర్స్ ను సంపాదించుకొని కలకలం రేపుతుంది. దీనిని చాలామంది జనరేషన్ జెడ్ తరంలో రగిలిన ఉద్యమం అని పిలుస్తున్నారు. ఇది సార్వత్రిక ఎన్నికల్లో పెను మార్పుకు నాంది పలుకుతుందని జోస్యం చెబుతున్నారు. సాధారణంగా ఇటువంటి సంచలన విషయాలు తెరపైకి వచ్చినప్పుడు.. కొంతమంది స్వయం ప్రకటిత మేధావులు రకరకాలు వ్యాఖ్యలు చేస్తూ ఉంటారు. ఇలాంటివారు కొద్ది రోజులు మీడియాలో హల్చల్ చేస్తారు. ఆ తర్వాత జనం మర్చిపోతారుమనదేశంలో ప్రజాస్వామ్యానికి ఒక విలువ ఉంది. దానికంటూ బలమైన నిర్మాణం ఉంది. అధికారంలో ఉన్న పార్టీ తప్పు చేస్తే.. ప్రతిపక్షంలో ఉన్న పార్టీకి అధికారాన్ని కట్టబెడతారు. ఒకవేళ రెండు పార్టీలు ప్రజల అభిమానాన్ని సొంతం చేసుకోకపోతే..మూడో పార్టీకి అధికారాన్ని దక్కేలా చేస్తారు. అంతేతప్ప సోషల్ మీడియాలో ఫాలోవర్స్ ఆధారంగా అధికారాన్ని కట్టబెట్టరు..

తాత్కాలిక ఆవేశాలు వేరు.. దీర్ఘకాలిక ప్రణాళికలు వేరు. రెండు కూడా ఒకే విధంగా ఎప్పుడూ ఉండవు. ఇక కాక్రోచ్ జనతా పార్టీ విషయంలో పాకిస్తాన్ హస్తము ఉందని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతుంది.. ఎప్పుడైతే ఈ పార్టీకి ఇన్స్టాగ్రామ్ లో విపరీతమైన ఫాలోవర్స్ నమోదయ్యారో.. అప్పుడే కొంతమంది దీని వెనక ఏదో జరుగుతోందని అనుకున్నారు. దానికి తగ్గట్టుగానే పరిశోధన మొదలుపెట్టారు. చివరికి అసలు నిజాన్ని బయటపెట్టారు. కాక్రోచ్ జనతా పార్టీ ని అనుసరిస్తున్న ఫాలోవర్స్ లో పాకిస్తాన్ నుంచి 49 శాతం, అమెరికా నుంచి 14 శాతం, బంగ్లాదేశ్ నుంచి 14%, ఇండియా నుంచి తొమ్మిది శాతం, యూకే, ఆస్ట్రేలియా, సౌదీ అరేబియా, ఇతరులు మూడు శాతం, యూఏఈ నుంచి రెండు శాతం అనుసరిస్తున్నారు.

దీని వెనక కుట్ర కోణం ఉందని.. అందువల్లే ఓవర్ నైట్ లో కాక్రోచ్ జనతా పార్టీకి ఈ స్థాయిలో ఫాలోవర్స్ ఉన్నారని సోషల్ మీడియాలో బిజెపి అనుకూల వ్యక్తులు వ్యాఖ్యానిస్తున్నారు.దేశంలో నిరుద్యోగ యువతను ఉద్దేశించి 'నిరుద్యోగ బొద్దింకలు' అని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలకు నిరసనగా తాజా గా 'ఎక్స్' వేదికగా కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) పుట్టికొచ్చింది. ఈ నెల 16న 'ఆప్' మాజీ రాజకీయ వ్యూహకర్త అభిజీత్ దిప్కే వ్యంగ్యపూరితంగా ఆ ఖాతాను ప్రారంభించారు. ఖాతా ప్రారంభమైన రెండు రోజు ల్లోనే, దేశవ్యాప్తంగా లక్షల మంది యువ త ఖాతాను ఫాలో అయ్యారు.ముఖ్యంగా ఖాతాకు 'జెన్జెడ్' మద్దతు అనూహ్యంగా పెరుగుతూ వస్తుంది. ఈ క్రమంలో నిఘావర్గాలు ఆ ఖాతాను తొలగించాయి. మై భీ కాక్రోచ్ (నేను కూడా బొద్దికనే) అనే నినాదంతో కాక్రోచ్ జనతా పార్టీ ఆన్లైన్లో సంచలనం సృష్టిస్తోంది. యువత ఎదుర్కొంటున్న సమస్యలను వ్యంగ్యంగా, హాస్యంగా ప్రస్తావిస్తూ ఈ పార్టీ లక్షలాది మందిని ఆకర్షిస్తోంది. కొద్దిరోజుల్లోనే ఇన్స్టాగ్రామ్లో ఈ పేజీ ఏకంగా 12.7 మిలియన్ల పైగా ఫాలోవర్లను సంపాదించుకుని ఇంటర్నెట్ సెన్సేషన్గా మారింది. యూట్యూబ్ సెన్సేషన్, బీజేపీ విధానాలను విమర్శించే ధ్రువ్ రాఠీ కూడా తాను ఆ పార్టీలో చేరతానంటూ ప్రకటించారు.వార్తా సేవలుకాక్రోచ్ జనతా పార్టీని స్థాపించింది అభిజీత్ దీప్కే. దీంతో ఎవరీ అభిజీత్ దీప్కే అని నెటిజన్లు వెతుకుతున్నారు. అభిజీత్ మహారాష్ట్రంలోని ఛత్రపతి శంభాజీ నగర్ కు చెందిన వ్యక్తి. అతను పూణెలో జర్నలిజం చదివాడు. ఆ తరువాత ఇంట్లోనే పోస్ట్ గ్రాడ్యుయేషన్ కు ప్రిపేరయ్యాడు.

బోస్టన్ యూనివర్శిటీలో పబ్లిక్ రిలేషన్స్లో మాస్టర్స్ డిగ్రీ చేయడానికి అమెరికా వెళ్లాడు. 2020 నుంచి 2022 వరకు ఆమ్ ఆద్మీ పార్టీ సోషల్ మీడియా సిబ్బందిలో ఉద్యోగిగా పనిచేశాడు. 2020 ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఆమ్ఆద్మీ పార్టీ ప్రచారం కోసం వైరల్ మీమ్ ఆధారిత కంటెంట్ ను రూపొందించడంలో కీలక భూమిక పోషించినట్లు తెలిసింది. కాక్రోచ్ జనతా పార్టీని ఏర్పాటు చేసి.. ఆ పార్టీ కోసం ఒక వెబ్ సైట్ తోపాటు ఇన్ స్టాగ్రామ్, ట్విటర్ వంటి సోషల్ మీడియా ఖాతాలను సైతం ఏర్పాటు చేశాడు.

ఇందులో దీప్కే పెట్టిన మొదటి పోస్టు 'బయట ఉన్న 'బొద్దింకలు' అందరి కోసం ఒక కొత్త వేదికను ప్రారంభిస్తున్నాను. నిరుద్యోగులు, సోమరులు, నిరంతరం ఆన్లైన్లో ఉండేవారందరూ ఈ పార్టీలో చేరేందుకు అర్హులు' అని సదరు పోస్టులో పేర్కొన్నాడు'. అంతటితో ఆగలేదు.. అదే రోజు పార్టీ వెబ్సైట్ను ప్రారంభించాడు.ఈ జెన్జెడ్ ఉద్యమం నేపాల్ లేదంటే బంగ్లాదేశ్లో జరిగినట్లుగా మారుతుందా అని చాలా మంది పాత్రికేయులు నన్ను అడుగుతున్నారు. నేను ఈ విషయాన్ని చాలా స్పష్టంగా చెప్పాలనుకుంటున్నాను. అటువంటి పోలికలు చేస్తూ భారతదేశంలోని జెన్జెడ్ను అవమానించవద్దు. వారిని తక్కువ అంచనా వేయవద్దు. చాలా మంది అనుకున్నదానికంటే ఈ దేశ యువత చాలా పరిణతి, అవగాహన, రాజకీయ చైతన్యం కలిగి ఉన్నారు. వారు తమ రాజ్యాంగ హక్కులను అర్థం చేసుకున్నారు.

శాంతియుత, ప్రజాస్వామ్య మార్గాల ద్వారా తమ అసమ్మతిని వ్యక్తం చేస్తారు. దయచేసి, వారిని కించపరచవద్దు. ఈ యువతలో చాలా మంది ప్రస్తుతం ప్రభుత్వాన్ని నడుపుతున్న వారి కంటే చాలా ఎక్కువ విద్యావంతులు, విషయ పరిజ్ఞానం కలవారు ఉన్నారంటూ అభిజీత్ దీప్కే పేర్కొన్నాడు. మహిళలకు రాజకీయాల్లో, క్యాబినెట్ లో 50 శాతం ప్రాతినిధ్యం కల్పించాలి. పార్టీలు మారే (ఫిరాయించే) ప్రజాప్రతినిధులపై 20 ఏళ్ల పాటు పోటీ చేయడానికి వీలు లేకుండా నిషేధం విధించాలి. మెయిన్స్ట్రీమ్ మీడియా యాంకర్ల బ్యాంక్ ఖాతాలను, వారి వెనుక ఉన్న కార్పొరేట్ శక్తులను క్షుణ్ణంగా తనిఖీ చేయాలి.ఎన్నికల ముందు ఓటర్ల జాబితా నుండి అర్హులైన ఓటర్లను తొలగిస్తే.. అందుకు బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి. విద్యార్థుల సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ముఖ్యంగా పరీక్షల్లో జరిగే మోసాలు, పేపర్ లీకేజీలపై గట్టిగా గళం విప్పాలి.. కఠిన చర్యలు తీసుకోవాలి.ప్రస్తుతం సోషల్ మీడియాలో సంచలనంగా మారిన ఈ 'కాక్రోచ్ జనతా పార్టీ' రానున్న భవిష్యత్తులో నిజమైన రాజకీయ పార్టీగా అవతరిస్తుందని చాలా మంది అభిప్రాయపడుతున్నారు. అయితే ఏది ఎలా ఉన్నా.. ప్రస్తుతం యువతరం తమ నిరసనను డిజిటల్ రూపంలో వ్యక్తం చేయడానికి ఈ కాక్రోచ్ జనతా పార్టీ ఒక సరికొత్త వేదికగా నిలిచింది. త్వరలోనే ఈ పార్టీ భవిష్యత్తు కార్యాచరణ, విధివిధానాల పై ఒక ఆన్లైన్ జెన్ జీ సదస్సు నిర్వహించనున్నట్లు వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే ప్రకటించారు.

## ఫ్యూచర్ సిటీ రద్దు

ఆ భూములను రైతులకు వెనక్కి ఇచ్చేయాల్సి ఉంటుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఫ్యూచర్ సిటీ పేరుతో కేవలం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తోందని విమర్శించారు.ఫార్మా సిటీని రద్దు చేయడం లేదని రేవంత్ సర్కార్ హైకోర్టులో కేసు విచారణ సందర్భంగా అబద్ధాలు చెప్పిందని హరీశ్రావు పేర్కొన్నారు. ఓవైపు కోర్టుకు ఫార్మా సిటీ కొనసాగిస్తామని చెబుతూనే మరోవైపు ఫ్యూచర్ సిటీ అంటూ కాంగ్రెస్ ప్రభుత్వం డ్రామాలు ఆడుతోందని మండిపడ్డారు. ఫార్మా సిటీ ద్వారా లక్షలాది మంది యువతకు ఉద్యోగావకాశాలు వస్తాయని చట్ట ప్రకారం దాన్నే కొనసాగించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

## జూన్ 2 నుండి పంపిణీ

దరఖాస్తు చేసుకొని ప్రభుత్వ నిర్ణయం కోసం వేచి చూస్తున్న వారి సంఖ్య గణనీయంగా ఉంది. కాగా, బడ్జెట్ లో ఇప్పటి కే ప్రకటించిన రెండు లక్షల పెన్షన్ల తో పాటుగా రేషన్ కార్డుల పంపిణీకి ప్రభుత్వం ముహూర్తం నిర్ణయించింది. దరఖాస్తులు.. అర్హతల పైనా నిర్ణయం తీసుకుంది. ఇదే సమయంలో ప్రభుత్వం వీటికి సంబంధించి మరో ముఖ్య నిర్ణయంతో ముందుకు వెళ్తోంది. తెలంగాణలో కొత్త పెన్షన్లు.. ఇందిరమ్మ ఇళ్లు.. రేషన్ కార్డుల కోసం వేచి చూస్తున్న లబ్దిదారులకు ప్రభుత్వం కీలక అప్డేట్ ఇచ్చింది. తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా జూన్ 2వ తేదీ నుంచి రెండు లక్షల మందికి కొత్త పింఛన్లు మంజూరు చేస్తామని కార్మిక, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ ప్రకటించారు. పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అర్హులైన వారికి పింఛన్లు మంజూరు చేయలేదని ఆరోపించారు. రాష్ట్రంలో నూతనంగా 2లక్షల మందికి పింఛన్లు మంజూరు కోసం బడ్జెట్లో కేటాయింపులు జరిగాయని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరిస్తోందని, వేగవంతంగా దిగుమతులు చేయించేందుకు అధికారులు, మిల్లర్లను సమన్వయం చేస్తూ చర్యలు చేపట్టిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం రాష్ట్రవ్యాప్తంగా పూర్తయి గృహ ప్రవేశాలు అవుతున్నాయని వివరించారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియ జూన్లో ప్రారంభవుతుందని ఆయన తెలిపారు.

## ఉప్పల్‌లో సన్‌రైజర్స్ జయభేరి

క్వాలిఫయర్ 1 పై కన్నేసిన సన్రైజర్స్ హైదరాబాద్ టాపార్డర్ విధ్వంసంతో కొండంత స్కోర్ కొట్టింది. ఉప్పల్ స్టేడియంలో అభిషేక్ శర్మ(56) మెరుపు ఆరంభాన్నివ్వగా.. ఇషాన్ కిషన్(79), క్లాసెన్(51) జోడీ తర్ధ శతకాలతో ఆర్సీబీ బౌలర్ల భరతం పట్టింది. వీరిద్దరూ శతక భాగస్వామ్యం నెలకొల్పగా.. డెత్ ఓవర్లలో నితీశ్ రెడ్డి(29 నాటౌట్) సిక్సర్లతో రెచ్చిపోగా హైదరాబాద్ ప్రత్యర్థికి భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. చివరి లీగ్ మ్యాచ్లో సన్రైజర్స్ హైదరాబాద్ బ్యాటర్లు చెలరేగిపోయారు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న కెప్టెన్ కమిన్స్ నమ్మకాన్ని నిలబెడుతూ రెండొందల స్కోరందించారు. పవర్ ప్లేలోనే ట్రావిస్ హెడ్(26) ఔటైనా అభిషేక్ శర్మ(56) జోరు తగ్గించలేదు. ఇషాన్ కిషన్(79)తో కీలక భాగస్వామ్యంతో స్కోర్ వంద దాటించాడు. షెపర్డ్ ఓవర్లో సిక్స్, ఫోర్లతో రెచ్చిపోయిన అభిషేక్ 22 బంతుల్లో అర్ధ శతకం సాధించాడు. సిక్సర్ కొట్టబోయి అతడు ఔటైనా.. తర్వాత క్లాసెన్(51) మరో ఖతర్నాక్ ఇన్నింగ్స్తో చెలరేగాడు.

**113 పరుగులు రాబట్టి**

చెన్నై సూపర్ కింగ్స్పై సాధికారిక ఇన్నింగ్స్ ఆడిన ఇషాన్, క్లాసెన్ జంట ఆర్సీబీ బౌలర్లకు చుక్కలు చూపించింది. ముఖ్యంగా ఇషాన్ మూడో వికెట్కు ఈ జోడీ బౌండరీలతో ఆర్సీబీ బౌలర్లను బెంబేలెత్తించింది. డెత్ ఓవర్లలో.. రసిక్ దార్ ఓవర్లో బౌండరీతో హైదరాబాద్ స్కోర్ రెండొందల మార్క్ చేరింది. మూడో వికెట్కు 113 పరుగులు రాబట్టిన ఈ ద్వయాన్ని విడదీసి కృనాల్ పాండ్యా ఊరటనిచ్చాడు. క్రీజులోకి వస్తూనే నితీశ్ రెడ్డి () రెండుసార్లు బంతిని బంతిని స్టాండ్స్లోకి పంపాడు. ఇన్నింగ్స్ చివరి బంతికి ఇషాన్ ఔటవ్వగా 4 వికెట్ల నష్టానికి హైదరాబాద్ 255 పరుగులు చేసింది. ఆర్సీబీని 165కే ఆలౌట్ చేస్తే కమిన్స్ సేన క్వాలిఫయర్ 1కు అర్హత సాధించనుంది.

## నిందితుడు అరెస్టు

ఈ కేసులో ప్రధాన నిందితుడు షేక్ రెహమాన్ (46)ను కర్ణాటక రాష్ట్రంలోని గుల్బర్గా వద్ద అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి రూ.9,53,760 నగదు, ఒక మొబైల్ ఫోన్, ఇన్నోవా క్రిస్టా వాహనం తాళం చెవి స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. బషీర్ బాగ్ లోని డిసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో డీసీపీ శిల్పవల్లి వివరాల ప్రకారం.. మే 19న క్లియర్డ్ సెక్యూరిటీ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ (CSS) సిబ్బంది వివిధ వ్యాపార సంస్థల నుంచి నగదు సేకరించి కోఠిలోని ఎస్బీఐ ప్రధాన శాఖకు చేరుకున్నారు. ఈ సమయంలో ఇద్దరు కస్టోడియన్లు నగదుతో బ్యాంకులోకి వెళ్లగా, గన్మ్యాన్ వాష్ రూమ్ కోసం వాహనం నుంచి బయటకు వెళ్లాడు. ఆ అవకాశాన్ని ఉపయోగించుకున్న క్యాష్ రవాణా చేస్తున్న డ్రైవర్ షేక్ రెహమాన్ రూ.19 లక్షల నగదు ఉన్న వాహనాన్ని తీసుకుని పరారయ్యాడు. దీనితో కస్టోడియన్ గడ్డం మల్లేష్ సుల్తాన్ బజార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టిన పోలీసులు వాహనం కింగ్కోఠి జిల్లా ఆసుపత్రి సమీపంలో గుర్తిమచారు. అయితే అందులోని రెండు నగదు బ్యాగ్స్ లో ఉన్న 9.6 లక్షలను నిందితుడు తీసుకొని పారిపోయినట్లు గమనించారు. సాంకేతిక ఆధారాలు మరియు దర్యాప్తు సహాయంతో నిందితుడు గుల్బర్గాలో ఉన్నట్లు గుర్తించిన ప్రత్యేక బృందం, మే 21న గుల్బర్గా సబేరా గెస్ట్ హౌస్ వద్ద అతడిని అదుపులోకి తీసుకుని , అతని నుండి 9.5 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ కేసును ఛేదించిన సుల్తాన్ బజార్ పోలీస్ సిబ్బందిని డీసీపీ అభినందించారు.

## రాజ్యసభ ఎన్నికల షెడ్యూల్ విడుదల

**ఎన్నికల షెడ్యూల్:**

నోటిఫికేషన్ విడుదల జూన్ 1, నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ జూన్ 8, పోలింగ్, ఫలితాలు జూన్ 18.

**ఆంధ్రప్రదేశ్‌లో ఖాళీ కానున్న 4 స్థానాలు ఇవే:**

అయోధ్య రామిరెడ్డి (వైసీపీ), పిల్లి సుభాష్ చంద్రబోస్ (వైసీపీ, పరిమళ్ నత్వానీ (వైసీపీ), సానా సతీష్ బాబు (టీడీపీ గత ఉపఎన్నికలో ఎన్నికయ్యారు)

ప్రస్తుత అసెంబ్లీ సంఖ్యాబలం ప్రకారం ఏపీలోని ఈ నాలుగు స్థానాలూ కూటమి ఖాతాలోకి వెళ్లడం లాంఛనమే. కాకపోతే కూటమిలో సీట్ల సర్దుబాటు, ఎవరెవరికి ఎన్ని సీట్లు అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఈ విడతలో జాతీయ రాజకీయాల్లోని అత్యంత కీలక నేతల రాజ్యసభ పదవీకాలం ముగుస్తుండటంతో ఈ ఎన్నికలపై అందరి దృష్టి పడింది.

**కర్ణాటక (4 స్థానాలు):** ఇక్కడి నుంచి కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, మాజీ ప్రధాని హెచ్.డి. దేవెగౌడల పదవీకాలం ముగియనుంది.

**మధ్యప్రదేశ్ (3 స్థానాలు):** కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ సీఎం దిగ్విజయ్ సింగ్ పదవీకాలం ముగియనుంది.

**ఇతర రాష్ట్రాల ఖాళీల వివరాలు:** గుజరాత్ (4), రాజస్థాన్ (3), జార్ఖండ్ (2), మణిపూర్ (1), మేఘాలయ (1), అరుణాచల్ ప్రదేశ్ (1), మిజోరాం (1). సరిగ్గా జూన్ 18న ఒకేరోజు పోలింగ్ జరిపి, అదే రోజు సాయంత్రం ఫలితాలను కూడా ఈసీ ప్రకటించనుంది

# యాదాద్రికి కంచి కామకోటి పీఠాధిపతి


- పూర్ణకుంభంతో స్వాగతం పలికిన ఆలయ అర్చకులు

**జయభేరి, యాదగిరిగుట్ట, మే 22 :**

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి క్షేత్రాన్ని కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ శ్రీశ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వా మీజీ దర్శించారు. నేడు ఆలయ అభివృద్ధి పనుల భాగంగా శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వేద పాఠశాలకు శంకుస్థాపన, పలు అభివృద్ధి పనులకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన జరిపిన సందర్భంగా కంచి కామకోటి పీఠాధిపతి పర్యవేక్షణలో సాగనున్నాయి. ఈ సందర్భంగా శుక్రవారం సాయంత్రం ఆలయానికి కంచి కామకోటి పీఠాధిపతులు పరమహంస పరివ్రాజకాచార్యులు శ్రీ శ్రీ శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామి ఆలయానికి చేరుకున్నారు. ఆలయానికి చేరుకున్న కంచి కామకోటి పీఠాధిపతికి ఆలయ ప్రధానార్చకులు, ఉప ప్రధానార్చకులు, అర్చకులు,వేద పండితులు వేదమంత్రోచ్చారణలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు.



ఆలయ అధికారులు స్వామి వారి దర్శన ఏర్పాట్లు చెయ్యగా స్వామివారి దర్శనానంతరం కళావేదిక యందు శ్రీ స్వామి వారు భక్తులనుద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ డైరెక్టర్ హనుమంత రావు, యాదగిరిగుట్ట ఆలయ ఈవో భవాని శంకర్, అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, డిఈవో నవీన్ కుమార్, ఏఈవోలు, ఆలయ సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.







## యాదాద్రి దేవస్థాన గోశాలకు 2 ట్రాక్టర్ల పశుగ్రాసం అందజేత

**జయభేరి, తుర్కపల్లి, మే 22 :**

తుర్కపల్లి మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కల్లూరి ప్రభాకర్ రెడ్డి తమ తల్లిగారైన సుక్కమ్మ వ్యవసాయ క్షేత్రం నుండి రెండు ట్రాక్టర్ల పశుగ్రాసాన్ని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి యాదగిరిగుట్ట దేవస్థానం గోశాలకు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవస్థానంలో గల గోశాలకు ఎండాకాలం దృష్టిలో ఉంచుకొని పశువులకు పశుగ్రాసాన్ని అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కల్లూరి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- మార్కెట్ కమిటీ చైర్మన్



**జయభేరి, తుర్కపల్లి, మే 22 :**

తుర్కపల్లి మండలం ములకలపల్లి, పల్లెపహాడ్, తుర్కపల్లి ,గ్రామాల్లోని పిఏసిఎస్ మాదాపురం, చిన్న లక్ష్మాపురం గ్రామాల్లోని ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ అయినాల చైతన్య మహేందర్రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ జరుగుతున్న కొనుగోలు ప్రక్రియను రైతులను అడిగి తెలుసుకున్నారు లారీలు రోజురోజు ఎక్కువ సంఖ్యలో వస్తే మా ధాన్యం త్వరగా మిల్లులకు పోతాయని రైతులు వేడుకోగా వారికి లారీలు త్వరగా రోజురోజు వచ్చేలా ఏర్పాటు చేస్తామని చెప్పి అక్కడి సంబంధిత అధికారులతో మాట్లాడి రైతులకు హామీ ఇవ్వడం జరిగింది. దాన్యం కొనుగోలు కేంద్రాల్లో రికార్డులను పరిశీలించి రైతులకు సరియైన మౌలిక వసతులు కల్పించి వారికి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని ఇన్చార్జిలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ రవికుమార్ పాల్గొన్నారు.



## నేడు దేవరకద్రలో హిందూ సమ్మేళనం

- శ్రీనివాస గార్డెన్ లో సమావేశం
- పూర్తయిన ఏర్పాట్లు
- ముఖ్య అతిథిగా హాజరవుతున్న శ్రీ శ్రీ శ్రీ శంకర్ స్వామీజీ

**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో శనివారం (నేడు) హిందూ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. స్థానిక శ్రీనివాస గార్డెన్ ఫంక్షన్ హాల్లో ఆరోజు సాయంత్రం 6 గంటలకు ఈ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీ మానికేశ మహాసంస్థానం దామర్ చేడ్, తెలంగాణ సాదు పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు, విశ్వ హిందూ పరిషత్ సామాజిక సమరసత తెలంగాణ ప్రాంత మార్గదర్శకుడు శ్రీ శ్రీ శ్రీ శంకర స్వామి హాజరవుతున్నారు. అలాగే వక్త సంస్కార భారతి ప్రాంత సంఘటన మంత్రి శ్రీ జమాల్ పూర్ నిరంజన్, మహిళా వక్త హైకోర్టు న్యాయవాది, సామాజిక కార్యకర్త శ్రీమతి మౌనిక సుంకర హాజరవుతున్నారు. ఈ సందర్భంగా సమ్మేళనంలో వివిధ సంస్కృతిక కార్యక్రమాలు, భజనలు, హనుమాన్ చాలీసా పారాయణం, అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలను నిర్వహించనున్నారు. కావున ఈ కార్యక్రమానికి ఆత్మీయ హైందవ సోదర, సోదరీమణులు అధిక సంఖ్యలో హాజరుకావాలని హిందూ సమ్మేళన ఉత్సవ సమితి అధ్యక్షుడు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి కల్వ నరేష్ కుమార్, కోశాధికారి భాస్కర్ కోరారు.



# నేడు యాదగిరిగుట్టకు సిఎం రేవంత్ రెడ్డి

- ఏర్పాట్లను పరిశీలించిన ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

**జయభేరి, యాదగిరిగుట్ట, మే 22 :**

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి శనివారం యాదగిరిగుట్టకు విచ్చేస్తున్న నేపథ్యంలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఏర్పాట్ల బాధ్యతను భుజాన వేసుకున్నారు. సీఎం పర్యటనను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఆయన శుక్రవారం ఉదయమే యాదగిరిగుట్టకు చేరుకొని క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు.



ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి లోటుపాట్లు రాకుండా,అన్ని శాఖలను సమన్వయం చేస్తూ ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య స్వయంగా పనులను పర్యవేక్షించడం విశేషం. టెంపుల్ సిటీ పరిసరాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు,భద్రతా చర్యలు, పారిశుధ్య నిర్వహణ, మరియు ట్రాఫిక్ నియంత్రణపై అధికారులతో కలిసి ఆయన సుదీర్ఘంగా సమీక్షించారు.

**హెలిప్యాడ్ వద్ద ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య సమీక్ష**

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిగనున్న హెలిప్యాడ్ వద్దకు చేరుకున్న ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అక్కడ కల్పించిన సదుపాయాలను స్వయంగా తనిఖీ చేశారు. భద్రతా ఏర్పాట్లు, సీఎం కాన్వాయ్ రూట్ మ్యాప్, వాహనాల పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. సీఎం పర్యటనకు వచ్చే ప్రజలకు, భక్తులకు ఎక్కడా ఎలాంటి ఇబ్బంది కూడా కలగకుండా పకడ్బందీగా మార్గదర్శకాలను అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.

**ఆలేరు నియోజకవర్గ ప్రగతికి సరికొత్త ఊతం: బీర్ల అయిలయ్య**

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటనను విజయవంతం చేయడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి ఆశీస్సులతో,సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో టెంపుల్ సిటీ అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని, ఆలేరు నియోజకవర్గం ప్రగతి పథంలో దూసుకుపోతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యాదగిరి గుట్ట డిఏస్పి శ్రీనివాస్ నాయుడు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మంగ సత్యనారాయణ, మాజీ ఉప సర్పంచ్ గుండ్లపల్లి భరత్ గౌడ్, కౌన్సిలర్లు బూడిద మధు, మాజీ ఎంపీపీ చీర శ్రీశైలం, సైదాపురం గ్రామ ఉప సర్పంచ్ దుంబాల వెంకట్ రెడ్డి, హేమేంధర్ పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే సిఫారసు లేఖపై బీజేపీ నేతలు ఫైర్

**జయభేరి, యాదగిరిగుట్ట, మే 22 :**

కొండపైన వర్తక సంఘాన్ని పదేళ్లు పొడిగించాలని యాదగిరిగుట్ట ఆలయ ఈవో భవానీ శంకర్ కు ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఇచ్చిన సిఫారసు లేఖపై బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రచ్చ శ్రీనివాస్, జిజెపి పార్టీ పట్టణ అధ్యక్షుడు కర్రె ప్రవీణ్ ఫైర్ అయ్యారు. కొండపైన ఎన్నో ఏళ్లుగా తిష్టవేసి దుకాణాలకు అతి తక్కువ కిరాయి చెల్లిస్తూ కొత్తవారికి ఉపాధి లేకుండా భక్తులను దోపిడీ చేస్తున్న వర్తక సంఘానికి ఆలేరు ఎమ్మెల్యే మద్దతు పలకడం సిగ్గు చేటన్నారు.




శుక్రవారం యాదగిరిగుట్ట పట్టణంలో మీడియాతో మాట్లాడారు. గత కొద్దినెలలుగా స్థానిక యువకులు, అన్ని పార్టీల నాయకులు వర్తక సంఘాన్ని రద్దు చేసి, టెండర్ల ద్వారా దుకాణాల కేటాయింపు చేపట్టాలని ధర్నాలు, నిరసనలు చేస్తూంటే ఎమ్మెల్యే ఎలా సిఫారసు లేఖ ఇస్తారని ప్రశ్నించారు. ఆలయ పునర్నిర్మాణంలో ఎంతో మంది రైతులు భూములు, దుకాణాలు కోల్పోయి బాధితులకు అండగా నిలవాల్సిన ఎమ్మెల్యే వర్త సంఘానికి అండగా నిలవడం పట్ల యాదగిరిగుట్ట పట్టణ వాసులు అసహ్యించుకుంటున్నారు. ఎమ్మెల్యే తక్షణమే సిఫారసు లేఖను ఉపసంహరించుకుని, కొండపైన షాపులను టెండరు ప్రక్రియ ద్వారానే మంజూరు చేసే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ప్రధాన కార్యదర్శి మందోజు నరేశ్,మండల ప్రధాన కార్యదర్శి గోపగాని ప్రసాద్, సీనియర్ నాయకులు బోనగిరి శ్యాం, లెంకలపల్లి శ్రీనివాస్, సత్యనారాయణ, ప్రభాకర్, సురేశ్, కృష్ణ, వంశి, వెంకటేశ్, నవీన్, వంశి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## కెసిఆర్ బొమ్మ టాటూ వేయించుకున్న అభిమాని


- మాజీ ఎమ్మెల్యే ఆలతో కలిసి కేటీఆర్ ను కలిసిన నక్క రమేష్



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని అడ్డాకుల మండలం కందూర్ గ్రామానికి చెందిన నక్క రమేష్ తన చేతిపై తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ బొమ్మ టాటు వేయించు కున్నారు. కెసిఆర్ పై ఉన్న అభిమానంతో ఆయన ఈ విధంగా ఆయన బొమ్మతో టాటు వేయించుకున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి తో కలిసి శుక్రవారం కేటీఆర్ ను హైదరాబాద్ లోని తెలంగాణ భవన్ లో మర్యాదపూర్వకంగా కలిశారు. కెసిఆర్ బొమ్మతో టాటు వేయించుకున్న నక్క రమేష్ ను కేటీఆర్ అభినందించారు.

## డ్రామా జూనియర్స్ సీజన్ 9 టీవీ షోకి శ్రీ హర్ష




**జయభేరి, దంతాలపల్లి, మే:22 :**

దంతాలపల్లి మండలంలోని దాట్ల గ్రామానికి చెందిన అనపర్తి వీరన్న లావణ్యల కుమారుడు అనపర్తి శ్రీ హర్ష,ఇతని తమ్ముడు తో కలిసి చిన్నతనం నుంచే సోషల్ మీడియాలో యాక్టీవ్ గా తన తండ్రి తో ఇంస్టాగ్రామ్, యూట్యూబ్ లో రీల్స్ చేస్తూ ఉండేవారు. తల్లి తండ్రుల ప్రోత్సహంతో, డ్రామా జూనియర్స్ అడిషన్స్ కు వెళ్లారు, గతంలో రెండు సీజన్ లో సెలెక్ట్ కాలేదు అయినా పట్టు విడువకుండా సీజన్ 9కు అడషన్స్ కు వెళ్లి సెలెక్ట్ అయినారు.జీ తెలుగు వారు నిర్వహిస్తున్నటువంటి డ్రామా జూనియర్స్ సీజన్ 9 కు మా కుమారుడు "అనపర్తి శ్రీహర్ష" కంటెస్టెంట్ గా ఎంపికైనందుకు మాకు చాలా సంతోషంగా ఉందని తల్లితండ్రులు,చెప్పుకొచ్చారు. ప్రత్యేకంగా మా ఊరు దాట్ల గ్రామం తరపున జీ తెలుగు ఛానల్ వారికి కృతజ్ఞతలు తెలియజేస్తునం.

## ధాన్యం కొనుగోళ్లు త్వరగా పూర్తి చేయాలి

- కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెనువెంటనే మిల్లులకు తరలించాలి
- జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి. ఎస్ లత

**జయభేరి, జగిత్యాల:**

జగిత్యాల జిల్లా పెగడపల్లి మండల కేంద్రం, పెగడపల్లి మండలంలోని బతికెపల్లి ఆరవెల్లి గ్రామల్లో ని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా పరిశీలించారు.ఈ సందర్భంగా కేంద్రాలలో జరుగుతున్న ధాన్యం కొనుగోలు ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వేగంగా కొనుగోలు ప్రక్రియను కొనసాగించాలని అధికారులకు సూచించారు. కేంద్రాలలో హమలీలు తగిన సంఖ్యలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ధాన్యం లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేసి లారీలను ఆలస్యం లేకుండా మిల్లులకు తరలించాలని ఆదేశించారు. అలాగే ట్రక్ షీట్ నమోదు, ట్యాబ్ ఎంట్రీలు వంటి అన్ని డాక్యుమెంటేషన్ పనులను సమయానికి పూర్తి చేయాలని, ఎలాంటి పెండింగ్ లేకుండా చూడాలని స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాలలో పారదర్శకత పాటించడంతో పాటు రైతులకు సరైన సమాచారం అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ధాన్యం కొనుగోలు సమయంలో తేమ శాతం, నాణ్యత ప్రమాణాలను ఖచ్చితంగా పరిశీలించాలని,రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఎటువంటి అవకతవకలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిసిఎస్ఓ జితేందర్ రెడ్డి, తహసీల్దార్, డిటి సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది, కేంద్రల నిర్వాహకులు పాల్గొన్నారు.

# జిల్లా 12వ మహాసభలను జయప్రదం చేయండి

- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రంగారెడ్డి జిల్లా 12వ మహాసభలను జయప్రదం చేయండి
- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కందుకూరి జగన్

**జయభేరి, షాద్ నగర్, మే:22 :**




జూన్ 13, 14 తేదీలలో షాద్ నగర్ జరగనున్న తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రంగారెడ్డి జిల్లా 12వ మహాసభలను విజయవంతం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కందుకూరు జగన్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా షాద్ నగర్ పట్టణంలోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశం డివిజన్ కన్వీనర్ శ్రీను నాయక్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి కందుకూరి జగన్ మాట్లాడుతూ... జిల్లాలో రియల్ ఎస్టేట్ పేరుతో పేదల భూములు కబ్జాకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పేదలు దున్నుతున్న భూములకు హక్కులు కల్పించాలని, ఇల్లు లేని పేదలకు ఇండ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేసి 14 రకాల నిత్యావసర వస్తువులను చౌక దుకాణాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అందించాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ప్రజలపై భారాలు మోపకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల కనీస అవసరాలు తీర్చే దిశగా పనిచేయాలని, పెంచిన పెట్రోల్, డీజిల్ మరియు నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని, దున్నేవానికి భూమి ఇవ్వాలని, కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని, ప్రభుత్వ భూములను పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల మేరకు ఆసరా, వితంతు, వికలాంగుల పెన్షన్లు పెంచాలని, కొత్త పెన్షన్లు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఉపాధి కార్మికుల కోసం ఉన్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసే కుట్రను కేంద్ర ప్రభుత్వం మానుకోవాలని అన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలకు మరింత దగ్గరగా పనిచేయడానికి ఈ జిల్లా మహాసభలను షాద్నగర్ ప్రాంతంలో నిర్వహిస్తున్నామని, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు అంజయ్య, ఉపాధ్యక్షులు సిహెచ్ జంగయ్య, కాకి రమేష్, సహాయ కార్యదర్శులు కుమార్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# జూన్ 2 నుండి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా

- దేవరకద్ర ఎమ్మెల్యే జీఎంఆర్
- మహబూబ్ నగర్ జిల్లా కలెక్టరేట్ లో ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక


**జయభేరి, దేవరకద్ర :**



వచ్చే జూన్ 2 నుండి రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలు చేయనున్నట్లు మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) అన్నారు. మహబూబ్ నగర్ జిల్లా కలెక్టరేట్ లో శుక్రవారం ప్రజా పాలనప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జియంఆర్ సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ..ప్రజా పాలనలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇచ్చిన హామీలు రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, గృహ జ్యోతి (200 యూనిట్ల ఉచిత విద్యుత్), మహిళలకు రూ.500 సబ్సిడీ గ్యాస్ సిలిండర్, మహాలక్ష్మి పథకంతో ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయడం జరిగిందన్నారు. అంతేకాక రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం ఇస్తున్నామని, ఇందిరా మహిళాశక్తి, మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు పూర్తి పారదర్శకంగా లబ్ధిదారులకు ఇవ్వడం జరిగిందన్నారు. అదేవిధంగా ప్రభుత్వం త్వరలో జూన్ 2 నుండి రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలు చేయబోతున్నట్లు, నూతనంగా 2 లక్షల పించన్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా ప్రజా ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజల్లో విస్తృతంగా ప్రచారం కల్పించాల్సిందిగా అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, మహబూబ్ నగర్ మేయర్ గుమ్మల మమత శ్రీనివాస్, మూఢ చైర్మన్ శ్రీ లక్ష్మణ్ యాదవ్, మహబూబ్ నగర్ మార్కెట్ యార్డ్ చైర్మన్ బెక్కరి అనిత మధుసూదన్ రెడ్డి, భూత్పూర్ మున్సిపల్ చైర్మన్ బాలకోటి, దేవరకద్ర మున్సిపాలిటీ వైస్ చైర్మన్ యుగేందర్ రెడ్డి మరియు వివిధ ప్రజా ప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# తరుగు పేరిట రైతులను నిలువు దోపిడీ చేయొద్దు

**జయభేరి, దేవరకొండ :**



తరుగు పేరిట రైతులను నిలువు దోపిడీ చేయొద్దు అని PACS చైర్మన్ పల్లా ప్రవీణ్ రెడ్డి అన్నారు.శుక్రవారం దేవరకొండ మండలం కొండభీమనపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ పిలుపు మేరకు నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రైతన్నల జీవితాలు అంధకారంలోకి నెట్టివేయబడ్డాయి అని ఆయన అన్నారు రోజుల తరబడి కల్లాల్లో ఉన్నధాన్యపు రాశులను పరిశీలించిన ఆయన, అక్కడ ఉన్నరైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.ధాన్యం తరలించేందుకు సరిపడా లారీలు అందుబాటులో లేకపోవడంతో కొనుగోలు కేంద్రాల్లో వడ్లు రోజుల తరబడి పేరుకుపోతున్నాయి అని ఆయన అన్నారు. రైతులు తీసుకొచ్చిన వడ్లలో అధికంగా తేమ, నాణ్యత పేరుతో అనవసర కోతలు విధిస్తున్నారు ఆయన తెలిపారు.పేరుకే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారని,కానీ ప్రభుత్వం ఇప్పటివరకు ఒక్క గింజ కూడా కొనుగోలు చేయలేదని విమర్శించారు.పంట వేసిన నాటి నుంచి పండించిన పంటను అమ్ముకునే వరకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారని పేర్కొన్నారు.కాంటాలు సకాలంలో జరగక రైతులు ఎండలో, వర్షంలో రోజులు తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది ఆయన అన్నారు.కొనుగోలు కేంద్రాల్లో సరైన పర్యవేక్షణ లేక అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు అని ఆయన అన్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి చెల్లింపులు ఆలస్యం అవడంతో రైతులు అప్పుల పాలవుతున్నారు.అకాల వర్షాల కారణంగా ధాన్యం తడిసిపోతున్నా సరైన రక్షణ చర్యలు తీసుకోవడం లేదు అని ఆయన అన్నారు.అన్ని కొనుగోలు కేంద్రాల్లో పారదర్శకంగా కాంటాలు నిర్వహించాలి అని ఆయన డిమాండ్ చేశారు.సరిపడా లారీలు ఏర్పాటు చేసి ధాన్యాన్ని వెంటనే తరలించాలి..రైతుల వడ్లలో అన్యాయ కోతలు నిలిపివేయాలి అని ఆయన కోరారు.దేశానికి అన్నం పెట్టే రైతన్నను ఇబ్బందులకు గురిచేయకుండా ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ, సర్పంచులు పల్లా శ్రీకాంత్ రెడ్డి, ఆదరాపు హరికృష్ణ,తోటకూరి వెంకటయ్య,స్థానిక ఉపసర్పంచ్ కడారి సైదులు,ముదిగొండ సంజీవ,అప్పనాల తిరుమల్,గుండాల వెంకట్ యాదవ్,ఇటుకల రాజు,బొడ్డుపల్లి ఏడుకొండల,కడారి అచ్చయ్య, జక్కుల అంజి, కడారి శ్రీను, జబ్బు ఉమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఐపీఎల్ బ్లాక్ టికెట్ల దందా గుట్టురట్టు

- నలుగురు అరెస్ట్!

**జయభేరి, ఉప్పల్ :**




ఐపీఎల్ 2026 లీగ్ దశ ముగింపునకు వస్తున్న వేళ..భాగ్యనగరంలో ఐపీఎల్ బ్లాక్ టికెట్ల దందా కలకలం రేపింది. ఉప్పల్ రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం వెలుపల బహిరంగంగా తిరుగుతూ.. మ్యాచ్ కాంప్లిమెంటరీ (ఉచిత) పాసులను భారీ ధరలకు అమ్ముతున్న నలుగురు వ్యక్తుల ముఠాను ఎల్బీనగర్ జోన్ ఎస్ఓటీ పోలీసులు శుక్రవారం రంగుపల్లాగా పట్టుకున్నారు. ప్రాథమిక విచారణ అనంతరం నిందితులను తదుపరి చర్యల కోసం ఉప్పల్ పోలీసులకు అప్పగించారు. హైదరాబాద్ సీపీ సుమతి ఆదేశాలతో స్టేడియం పరిసరాల్లో పోలీసులు నిఘా తీవ్రం చేశారు.

SRH vs RCB హైవోల్టేజ్ మ్యాచ్ - రెట్టింపైన టికెట్ల ధరలు: ఉప్పల్ వేదికగా నేడు (శుక్రవారం) సన్‌రైజర్స్ హైదరాబాద్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్ల మధ్య హైవోల్టేజ్ పోరు జరగనుంది. సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు ఇది ఈ సీజన్‌లో చివరి లీగ్ మ్యాచ్ కావడంతో ఉప్పల్‌లో మ్యాచ్ చూసేందుకు అభిమానులు ఎగబడుతున్నారు. ఫ్యాన్స్ క్రేజ్‌ను క్యాష్ చేసుకునేందుకు ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యం కూడా టికెట్ల ధరలను విపరీతంగా పెంచేసింది. ఉప్పల్ స్టేడియం అధికారిక కొత్త ధరల పట్టిక ఇదే: రూ. 950 టికెట్ ధరను ఏకంగా రూ. 2,000 కు పెంచారు. రూ. 1,500 టికెట్ ధర ఇప్పుడు రూ. 3,000. రూ. 1,910 టికెట్ ధరను రూ. 3,500 కు సవరించారు. రూ. 2,500 టికెట్ ధరను రూ. 4,500 చేశారు. రూ. 7,000 విలువైన విఐపి టికెట్ ధర రూ. 10,000 కు చేరింది. కార్పొరేట్ బాక్స్ (రూ. 23,000 టికెట్) ధర ఏకంగా రూ. 30,000 కు పెంచేశారు. అధికారికంగానే ధరలు అంతలా పెరిగిపోవడంతో..సామాన్య క్రికెట్ అభిమానులు ఎలాగైనా మ్యాచ్ చూడాలనే ఆరాటంతో స్టేడియం బయట తిరుగుతున్నారు. ఈ బలహీనతను ఆసరాగా చేసుకుని ఉచితంగా వచ్చే కాంప్లిమెంటరీ పాసులను వేల రూపాయలకు అమ్ముతున్న ముఠాలపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. క్రికెట్ అభిమానులు టికెట్ల కొనుగోలు విషయంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలని ఉప్పల్ పోలీసులు హెచ్చరించారు. అనధికారిక వ్యక్తులు, దళారుల నుంచి బ్లాక్‌లో టికెట్లు కొనుగోలు చేసి మోసపోవద్దని, కేవలం అధికారిక ప్లాట్‌ఫామ్స్ ద్వారానే టికెట్లు పొందాలని సూచించారు. స్టేడియం పరిసరాల్లో మారువేషాల్లో పోలీసులు నిఘా ఉంచినట్లు స్పష్టం చేశారు.



# విద్యార్థి ఉద్యమాలను బైండ్ ఓవర్ కేసులతో అణచలేరు

**జయభేరి, దేవరకొండ :**

మహాత్మా గాంధీ యూనివర్సిటీలో జరుగుతున్న అక్రమ ఔట్సోర్సింగ్ నియామకాలను ప్రశ్నిస్తున్న విద్యార్థి నాయకులపై బైండ్ ఓవర్ కేసులు పెట్టడం ప్రజాస్వామ్య హక్కులపై దాడి. అక్రమాలకు పాల్పడకపోతే తప్పులు చేయకపోతే విద్యార్థులు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సింది పోయి, పోలీసు కేసులతో ఉద్యమాలను అణచివేయాలని ప్రయత్నించడం VC, రిజిస్ట్రార్ వైఫల్యానికి నిదర్శనం. విద్యార్థుల నిరుద్యోగుల భవిష్యత్తును నాశనం చేస్తూ, రోస్టర్ నిబంధనలు, పారదర్శకత లేకుండా నియామకాలు చేపడుతున్నారనే ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్న సమయంలో వాటిపై స్పష్టత ఇవ్వకుండా విద్యార్థి నాయకులను టార్గెట్ చేయడం దారుణం. యూనివర్సిటీలో అక్రమాలను బయటపెడుతున్న నాయకులపై ఒత్తిడి తెచ్చి ఉద్యమాన్ని ఆపేయాలని చూస్తే విద్యార్థి సమాజం చూస్తూ ఊరుకోదు. ఎండాకాల సెలవులు ముగిసిన వెంటనే అక్రమ నియామకాలపై విద్యార్థి ఉద్యమాలు మరింత ఉధృతం అవుతాయనే భయంతోనే. యూనివర్సిటీ విద్యార్థి సంఘ BRSV నాయకుడు వాడపల్లి నవీన్‌ను నార్కెట్‌పల్లి పోలీసుల ద్వారా ఎమ్మార్వో ముందు బైండ్ ఓవర్ చేయించడం జరిగింది. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం నేరం కాదు అక్రమాలను ప్రశ్నించే ప్రతి విద్యార్థి గొంతును అణచివేయాలని చూసే VC, రిజిస్ట్రార్ తక్షణమే తమ వైఖరిని మార్చుకోవాలి. లేకపోతే మహాత్మా గాంధీ యూనివర్సిటీ విద్యార్థులు పెద్ద ఎత్తున ఉద్యమాలకు సిద్ధమవుతారు.

# ఎడ్ల వ్యాపారులను బెదిరించి నగదు, బంగారం వసూలు



**జయభేరి, జమ్మికుంట :**

ఎడ్లు కొనుగోలు చేసి తీసుకువస్తున్న ఇద్దరు వ్యక్తులను బెదిరించి నగదు బంగారం వసూలు చేసిన కేసులో పదకొండు మంది పై కేసు నమోదు చేశారు పోలీసులు, ఎనిమిది మందిని అరెస్ట్ చేయగా మరో ముగ్గురు పరారీలో ఉన్నారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంట పోలీస్ స్టేషన్లో ప్రెస్మీట్లో ఏసీపీ మాదేవి మాట్లాడుతూ..గత రెండు రోజుల క్రితం అర్ధ రాత్రి నల్గొండ జిల్లాకు చెందిన ఇద్దరు వ్యక్తులు జమ్మికుంట సమీప గ్రామాల నుండి రెండు ఎడ్లు కొనుగోలు చేసి అశోక లైలాండ్ వాహనం లో నల్గొండ కు తరలిస్తున్న క్రమంలో, స్థానిక పాత మున్సిపాలిటీ కార్యాలయం వద్ద వారిని అడ్డగించారు కొంత మంది యువకులు. మద్యం మత్తులో వారిని బెదిరించి 38 వేల నగదు అర తులం బంగారు ఉంగరం తీసుకున్నారు అంతే కాకుండా తమకు మరో లక్ష రూపాయలు ఇవ్వాలని రాత్రంతా తిప్పుకుంటూ డిమాండ్ చేశారు. దీంతో తెల్లవారుజామున ఇద్దరు వ్యక్తులకు జనాలు కనబడడంతో గట్టిగా అరవడంతో వారిని అక్కడే విడిచి పారిపోయారు. ఆయువకులు. అనంతరం బాధితులు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించుకుని పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని విచారించిన పోలీసులు బాధ్యులైన పదకొండు మంది పై కేసు నమోదు చేసి ఎనిమిది మంది యువకులను అరెస్ట్ చేశారు మరో ముగ్గురు పరారీలో ఉన్నట్టు తెలిపారు.వారి వద్ద నుండి 14వేల నగదు ,అరతులం బంగారు ఉంగరంతో నోటులు నాలుగు బైక్ లను స్వాధీనం చేసుకున్నారు. మిగతా.వారిని.త్వరలో.పట్టుకుంటామని అన్నారు ఈ యొక్క టీమ్ లో పాల్గొన్న పోలీసులను అభినందించి రివార్డ్ ఇచ్చారు ఈ కార్యక్రమంలో జమ్మికుంట సీఐ రామకృష్ణ గౌడ్ ఎస్సై రవి. హుజురాబాద్ ఎస్సై రాధాకృష్ణ పాల్గొన్నారు.



# ఆర్టీఐ కొండమల్లేపల్లి మండల అధ్యక్షుడిగా రామావత్ రవి నాయక్

**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ పట్టణంలో స్థానిక మీనాక్షి ప్లాజా ఆఫీసులో ఆర్టీఐ సమాచార హక్కు ప్రచార్ సమితి నూతన కమిటీ సమావేశంలో కొండమల్లేపల్లి మండల అధ్యక్షుడిగా రామావత్ రవి నాయక్ నియమితులు అయ్యారు. సమాచార హక్కు ప్రచార్ సమితి రాష్ట్ర అధ్యక్షులు కాట్రావత్ రాజు నాయక్ చేతుల మీదుగా నియామక పత్రం అందుకోవడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో నల్గొండ జిల్లా అధ్యక్షులు నారమోని హరీష్ నేరేడుగుమ్ము మండల అధ్యక్షుడు ఆంజనేయులు, నల్గొండ జిల్లా కార్యదర్శి కేతావత్ చందు తదితరులు పాల్గొన్నారు.

# కౌమార బాలికలకు హెల్త్ స్క్రీనింగ్ క్యాంప్



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ పురపాలక సంఘం నందు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మక చేపడుతున్న ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా సంజయ్ కాలనీ లోని బస్తీ దవఖానా నందు మెప్మా ఆద్వర్యంలో కౌమార బాలికలు అనగా 15 నుండి 18 సంవత్సరాల మద్య వయసు గల బాలికలు హెల్త్ స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహించడం జరిగింది. ఇట్టి క్యాంప్ మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీమతి పున్న శైలజ మున్సిపల్ కమిషనర్ యం. రమదుర్గ రెడ్డి ప్రారంభించడం జరిగింది, ఇట్టి క్యాంప్ కౌమార బాలికలు సద్వినియోగం చేసుకోవాలని చెప్పడం జరిగింది. ఇట్టి క్యాంప్ లో మెప్మా టిఎంసి జగమంతు, జంగాల కాలనీ బస్తీ దవఖానా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రగన సాధన్, సంజయ్ కాలనీ మెడికల్ ఆఫీసర్ బల్గీర్, స్టాఫ్ నర్సులు మెప్మా ఆర్పిలు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీ సమస్యలపై ఉన్నత స్థాయి వినతిపత్రం సమర్పణ




**జయభేరి, పరవాడ:**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యుడు రావాడ సీతారామ్ ని డిస్ట్రిక్ట్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మరియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ములకలపల్లి రాజు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలుసి ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాల సమస్యలపై వారు సుదీర్ఘంగా చర్చించారు. దళితులు, గిరిజనుల హక్కుల రక్షణ, వారిపై జరుగుతున్న అట్రాసిటీ కేసుల విచారణను వేగవంతం చేయడం, క్షేత్రస్థాయిలో బాధితులకు సత్వర న్యాయం అందించడం వంటి పలు కీలక అంశాలతో కూడిన ఉన్నత స్థాయి వినతిపత్రాన్ని (మెమోరాండం) కమిషనర్‌కు అందజేశారు.ఈ సందర్భంగా ములకలపల్లి రాజు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధుల సక్రమ వినియోగం, గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన, దళిత వర్గాలపై జరుగుతున్న దాడుల నివారణకు గట్టి చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను కోరినట్లు తెలిపారు.దీనిపై కమిషన్ సభ్యులు రావాడ సీతారామ్ సానుకూలంగా స్పందిస్తూ ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి, రక్షణకు కమిషన్ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు. వినతిపత్రంలో పేర్కొన్న సమస్యలను పరిశీలించి, తగిన న్యాయం జరిగేలా సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో డివిఎంసి సభ్యులు అప్పారావు సహదేవుడు మరియమ్మ, పలువురు దళిత, గిరిజన సంఘాల నాయకులు, ముఖ్యులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ప్రాధాన్య పథకాల అమలు తదితర అంశాలపై సమీక్ష




**జయభేరి, శామీర్‌పేట్ :**

మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా పరిపాలన ఆధ్వర్యంలో నిర్వహించిన 99 రోజుల "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" జిల్లా స్థాయి కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరయ్యారు. శామీర్‌పేట్ మండలం అంతాయిపల్లి గ్రామంలోని ఎస్.ఎన్.ఆర్. పుష్ప కన్వెన్షన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, ప్రభుత్వ ప్రాధాన్య పథకాల అమలు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, మున్సిపల్ చైర్‌పర్సన్లు, నామినేటెడ్ చైర్‌పర్సన్లు పాల్గొన్నారు. ప్రజా పాలనను మరింత సమర్థవంతంగా ప్రజలకు చేరవేయడంపై చర్చించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మనూ చౌదరి, BRS పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల కష్టాలు ప్రభుత్వంకు కనిపించడం లేదు

- రైతుల పక్షాన పోరాడుతున్న ఏకైక పార్టీ బిఆర్ఎస్ పార్టీ
- ఉలుపాల శేఖర్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు

**జయభేరి, దేవరకొండ :**



రైతుల కష్టాలు ప్రభుత్వానికి కనిపించడం లేదని బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఉలుపాల శేఖర్ రెడ్డి అన్నారు. వరి కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు పడుతున్న ఇబ్బందులపై బిఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు చింతపల్లి మండలం తీదేడు వరి కొనుగోలు కేంద్రం వద్ద గ్రామ బిఆర్ఎస్ పార్టీ నిర్వహించిన నిరసన కార్యక్రమంలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళ్లాల్లో ధాన్యం కొనుగోలు చేయడం సరిగా లేకపోవడంతో రైతుల కళ్లల్లో కన్నీరు ఆగడం లేదని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు ఇచ్చి రైతులను మోసం చేసిందని తెలిపారు.రైతు బతికితేనే రాష్ట్రం బతుకుతుందని అన్నారు.రైతు వ్యతిరేక పాలనకు ప్రజలే సమాధానం చెబుతారని ఆయన హెచ్చరించారు.రైతుల పక్షాన పోరాడుతున్న ఏకైక పార్టీ బి ఆర్ ఎస్ పార్టీ అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ధేన్యతండ గ్రామ సర్పంచ్ రమావత్ కొండల్ నాయక్,తీదేడు గ్రామ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సోనగంటి గొవర్ధనాచారి,బిఆర్ఎస్ పార్టీ నాయకులు మర్రు రామారావు, ఉలుపాల పురుషోత్తం రెడ్డి, సిమర్ల శ్రీను యాదవ్,రమావత్ మాంత్య నాయక్,తిరుమణి పాపయ్య,కాయితి బచ్చిరెడ్డి, మర్రు శ్రీనివాసరావు,శివర్ల పర్వతాలు ,శివర్ల రాములు,మర్రు సురెందర్ రావు,బొడ్డు చెన్నయ్య,మాదగోని కృష్ణ గౌడ్, రెడ్డి పరమేష్,వీరమల్ల వెంకటయ్య,గంటెల ఆంజనేయులు,కాయితి భగవాన్ రెడ్డి,మెరిక శంకరయ్య,ఉడుత శంకరయ్య,శివర్ల అనిల్, శివర్ల రమేష్,రమావత్ తుల్చ నాయక్,విజయ్,రాశిక మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.




## ఉపాధి హామీ కార్మికుల సమస్యల పరిష్కరించాలని ఆందోళన

**జయభేరి, పరవాడ:**


పరవాడ మండలం తానం గ్రామంలో ఉపాధి హామీ కార్మికుల సమస్యల పరిష్కరించాలని శుక్రవారం పని ప్రదేశంలో సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గని శెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి సరిపడ నిధులు కేటాయించకపోవడంతో గ్రామీణ పేదలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గతంలో అమలులో ఉన్న విధానాలను మార్చడం వల్ల కార్మికులకు పని దొరకడం కష్టమైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫేస్ యాప్ విధానం కారణంగా నెట్ వర్క్ సమస్యలతో కార్మికులు గంటల తరబడి పనిస్థలాల్లో వేచి ఉండాల్సి వస్తోందన్నారు. అలాగే వేసవి కాలంలో కార్మికులకు సమ్మర్ అలవెన్స్, మంచినీటి సౌకర్యం, మెడికల్ కిట్లు, టెంట్లు వంటి మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ప్రతి కుటుంబానికి 200 రోజుల పని కల్పించి, రోజుకు రూ.700 వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని, పని కోరిన ప్రతి కార్మికుడికి ఉపాధి కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. 10 లక్షల రూపాయలు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావు, పార్వతి, లక్ష్మి, రమణమ్మ, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి జనతావారధిలో పలు సమస్యపై వినతి పత్రం సమర్పణ

**జయభేరి, పరవాడ:**



భారతీయ జనతా పార్టీ ప్రతి శుక్రవారం నిర్వహించే జనతావారధి కార్యక్రమం అనకాపల్లి పార్లమెంటు సభ్యులు సీఎం రమేష్ పార్టీ ఆఫీసు నందు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యంగా ఐదు సమస్యల పైన వినతుల స్వీకరణ చేశారు. ఇందులో ప్రధానంగా లంకెలపాలెం జంక్షన్లో ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేయాలంటూ లంకెలపాలెం బిజెపి నాయకురాలు మడక శివపార్వతి ఆధ్వర్యంలో వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఇక్కడ ప్రజలు ట్రాఫిక్ సమస్యలుతో పాటు నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. స్థానికంగా ఉన్న ఫార్మసిటీ ఇతర పరిశ్రమల వలన నిత్యం రద్దీగా ఉంటుందని, అందువలన ఈ జంక్షన్ లో ఫ్లైఓవర్ నిర్మాణం ఒక్కటే ఈ సమస్యలన్నీటికి పరిష్కారమని, స్థానికులు సంతకాలు చేసి వినతి పత్రం ఇవ్వడం జరిగింది . అదేవిధంగా జీవీఎంసీలో 120 వార్డుల నుంచి 150 వార్డులు చేయాల్సింది గా కోరుతూ మరియు కొన్ని కాలనీ సమస్యల పై వినతి పత్రాలు సమర్పించారు. మరి కొన్ని వ్యక్తిగత సమస్యలు కూడా జనతా వారధిలో ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వర రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జనతా భారతి జిల్లా కన్వీనర్ గొర్లె రామనాయుడు మరియు అనకాపల్లి జిల్లా మరో ప్రధాన కార్యదర్శి బొడ్డేటి నాగేశ్వర రావు, రాష్ట్ర జిల్లా భారతీయ జనతా పార్టీ నాయకులు కార్యకర్తలు ఫిర్యాదుదారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.అనంతరం ప్రజల నుంచి స్వీకరించిన వినతులను పార్లమెంటు సభ్యుల కార్యాలయంలో ప్రభుత్వ పీఏ, కార్యాలయ ఇన్‌చార్జ్‌కు అందజేయడం జరిగింది.



## కంగనా సీక్రెట్ మ్యారేజ్

**జయభేరి, ముంబై, మే 22 :**

నటి, రాజకీయ నాయకురాలు కంగనా రనౌత్ రహస్యంగా పెళ్లి చేసుకున్నారా? సోషల్ మీడియాలో ఇప్పుడు ఇదే హాట్ టాపిక్. మెడలో మంగళసూత్రంతో కంగనా కనిపించిన ఒక వీడియో ఇంటర్నెట్‌లో వైరల్ కావడంతో ఈ ఊహాగానాలకు తెరలేచింది. అయితే, ఈ వార్తల్లో ఎలాంటి నిజం లేదని, అదంతా సినిమా చిత్రీకరణలో భాగమని తేలింది.ప్రముఖ ఫొటోగ్రాఫర్ వైరల్ భయానీ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో కంగనా రనౌత్‌కు సంబంధించిన ఒక వీడియోను షేర్ చేశారు. అందులో కంగనా సంప్రదాయ దుస్తుల్లో, మెడలో మంగళసూత్రంతో కనిపించారు. ఈ వీడియో చూసిన అభిమానులు, నెటిజన్లు ఒక్కసారిగా ఆశ్చర్యపోయారు. కంగనా ఎవరికీ చెప్పకుండా రహస్యంగా పెళ్లి చేసుకున్నారేమోనని కామెంట్ల రూపంలో ప్రశ్నల వర్షం కురిపించారు. కంగనా వైపు నుంచి గానీ, ఆమె బృందం నుంచి గానీ వెంటనే ఎలాంటి స్పందన రాకపోవడంతో ఈ ప్రచారం మరింత ఊపందుకుంది. అయితే, ఈ ప్రచారంలో వాస్తవం లేదని స్పష్టమైంది. కంగనా ధరించిన మంగళసూత్రం ఆమె వ్యక్తిగత జీవితానికి సంబంధించింది కాదు. 2014లో విడుదలై భారీ విజయం సాధించిన 'క్వీన్' సినిమాకు సీక్వెల్‌గా వస్తున్న 'క్వీన్ 2' సినిమాలోని పాత్ర కోసం ఆమె ఆ లుక్‌లో కనిపించారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ ప్రారంభమైంది. అందులో భాగంగానే కంగనా ఈ గెటప్‌లో ఉన్నారని తెలిసింది.'క్వీన్ 2' చిత్రాన్ని నిర్మిస్తున్న విషయాన్ని దర్శకుడు వికాస్ బహల్ సైతం ఇటీవల ధృవీకరించారు. "మేము కొంతకాలంగా 'క్వీన్ 2'పై పనిచేస్తున్నాం. చివరికి ఒక స్పష్టమైన రూపం వచ్చింది" అని ఆయన పింక్‌విల్లాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. మొదటి భాగంలో పెళ్లి రద్దవ్వడంతో ఒంటరిగా హనీమూన్‌కు యూరప్ వెళ్లే 'రాణి మెహ్రా' అనే యువతి పాత్రలో కంగనా నటనకు దేశవ్యాప్తంగా ప్రశంసలు దక్కాయి. ఇప్పుడు ఆ చిత్రానికి సీక్వెల్ వస్తుండటంతో సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి.

## పోలీస్ శాఖ హార్ట్ ఫుల్‌నెస్ మెడిటేషన్ కార్యక్రమం ప్రారంభం



**జయభేరి, పరవాడ:**

పరవాడ పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులు మరియు సిబ్బంది అందరూ పాల్గొనే విధంగా హార్ట్ ఫుల్‌నెస్ మెడిటేషన్ శిక్షణ కార్యక్రమం గురువారం నుండి శనివారం వరకు మూడు రోజుల పాటు వెన్నెలపాలెంలోని బండారు అప్పల నాయుడు కళ్యాణ మండపంలో ప్రారంభించబడింది. పరవాడ డీఎస్పీ బి. మోహనరావు పర్యవేక్షణలో పోలీసుశాఖలో సిబ్బంది మానసిక ప్రశాంతత, ఒత్తిడి నియంత్రణ, విధి నిర్వహణలో ఏకాగ్రత మరియు ఆరోగ్య పరిరక్షణ పెంపొందించుట లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహించబడుతోంది. ఈ కార్యక్రమం తొలి రోజు పరవాడ సబ్ డివిజన్‌కు చెందిన సుమారు 125 మంది పోలీసు అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.హార్ట్ ఫుల్‌నెస్ ట్రైనర్ మంగయ్య ధ్యానం, మానసిక ప్రశాంతత, ఒత్తిడి నియంత్రణ, విధి నిర్వహణలో ఏకాగ్రత మరియు వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన అంశాలపై సిబ్బందికి శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో పరవాడ సీఐ ఆర్. మల్లికార్జున రావు,ఎలమంచిలి సీఐ ఎస్. ధనుంజయరావు, అచ్యుతాపురం సీఐ చంద్రశేఖర్,రాంబిల్లి సీఐ నరసింహరావు,సబ్బవరం సీఐ రామచంద్రరావు మరియు వివిధ పోలీస్ స్టేషన్ల ఎస్సైలు పాల్గొన్నారు.

# గ్యాస్ మాఫియా గుట్టురట్టు

- నివాస గృహంలోనే రీఫిల్లింగ్ కేంద్రం


**జయభేరి, ఉప్పల్ :**



మేడ్చల్ జిల్లా మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని చెంగిచెర్ల ప్రాంతంలో గ్యాస్ రీఫిల్లింగ్ కేంద్రంపై సివిల్ సప్లై టాస్క్‌ఫోర్స్ అధికారులు నిర్వహించిన మెరుపుదాడిలో భారీ అక్రమ గ్యాస్ దందా వెలుగులోకి వచ్చింది. శ్రీ అరవింద్ ఎన్‌క్లేవ్‌లోని ఓ నివాస గృహాన్నే కేంద్రంగా మార్చుకుని కమర్షియల్ గ్యాస్ సిలిండర్లను అక్రమంగా రీఫిల్లింగ్ చేస్తూ వివిధ ప్రాంతాలకు సరఫరా చేస్తున్న ముఠాను అధికారులు గుర్తించారు. సివిల్ సప్లై టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ రమేష్ రెడ్డి, ఉప్పల్ అసిస్టెంట్ సివిల్ సప్లై ఆఫీసర్ సంధ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ దాడిలో మొత్తం 55 కమర్షియల్ గ్యాస్ సిలిండర్లు స్వాధీనం చేసుకున్నారు. ప్రమాదకర పరిస్థితుల్లో ఎటువంటి భద్రతా ప్రమాణాలు పాటించకుండా గ్యాస్ నింపుతున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని మేడిపల్లి పోలీసులకు అప్పగించారు.అధికారుల వివరాల ప్రకారం..చెంగిచెర్ల శ్రీ అరవింద్ ఎన్‌క్లేవ్ రోడ్ నెంబర్-02లోని ఇంటిలో కొంతకాలంగా రహస్యంగా గ్యాస్ రీఫిల్లింగ్ దందా కొనసాగుతోంది. 19 కేజీల కమర్షియల్ సిలిండర్లను తీసుకువచ్చి, అందులోని గ్యాస్‌ను ఇతర ఖాళీ కమర్షియల్ సిలిండర్లలోకి అక్రమంగా మార్చుతూ భారీ స్థాయిలో వ్యాపారం నిర్వహిస్తున్నట్లు గుర్తించారు.స్థానికుల సమాచారంతో రంగంలోకి దిగిన సివిల్ సప్లై టాస్క్‌ఫోర్స్ అధికారులు ఒక్కసారిగా దాడి చేసి గ్యాస్ మాఫియా గుట్టును రట్టు చేశారు.నివాస ప్రాంతంలోనే ఇలాంటి అక్రమ రీఫిల్లింగ్ కేంద్రాలు నిర్వహించడం వల్ల ఎప్పుడైనా భారీ అగ్నిప్రమాదం సంభవించే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరించారు. చిన్న స్పార్క్ కూడా ప్రాణాంతక ఘటనకు దారితీసే అవకాశం ఉందని తెలిపారు. అక్రమ గ్యాస్ వ్యాపారం కారణంగా ప్రభుత్వానికి ఆదాయ నష్టం కలగడంతో పాటు ప్రజల ప్రాణ భద్రత సైతం ప్రమాదంలో పడుతోందని పేర్కొన్నారు. అక్రమ గ్యాస్ ఫిల్లింగ్, రేషన్ బియ్యం బ్లాక్ మార్కెట్ దందాలకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని, ఇలాంటి వ్యవహారాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని అసిస్టెంట్ సివిల్ సప్లై ఆఫీసర్ సంధ్య స్పష్టం చేశారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. ఈదాడిలో అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ రమణారెడ్డి, కానిస్టేబుల్ నారా ప్రభాకర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి దృష్టికి అనకాపల్లి జిల్లా సమస్యలు

- సీఎంతో ముఖాముఖిలో అనకాపల్లి ఎం.పీ సి.ఎం రమేష్




**జయభేరి, అనకాపల్లి :**

అనకాపల్లి జిల్లాలో ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పలు సమస్యలను రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ శుక్రవారం అమరావతి రాష్ట్ర సచివాలయం నందు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లారు.ముఖ్యంగా నీటిపారుదల, తాగునీరు, రహదారులు, మౌలిక వసతులకు సంబంధించిన సమస్యలపై ముఖ్య మంత్రి సుదీర్ఘంగా చర్చించారు. జిల్లాలో ప్రస్తుతం కొనసాగుతున్న అభివృద్ధి పనుల, పారిశ్రామిక పురోగతిని వివరించి స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను సీఎం దృష్టికి తీసుకెళ్లారు.ఎప్పటినుంచో పరిష్కారం కోసం ఎదురుచూస్తున్న పలు సమస్యలను త్వరితగతిన పూర్తి చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు.ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులు తో సమన్వయం చేసి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

## ఉగ్ర నరసింహుని సన్నిధిలో మహా అన్నదాన కార్యక్రమం

**జయభేరి, హుజూర్ నగర్, మే 22 :**

ఒకపక్క భగ భగ మండుతున్న ఎండలు మరి ఒకపక్క చల్లని నరసింహుని చూడాలని తపన ఆరాటం ఈ రెండు సవాలను ఎదుర్కొంటూ భక్తులు ఎండలనీ సైతం లెక్కచేయకుండా నరసింహుని సన్నిధికి తరలివస్తున్నారు ప్రతి శుక్రవారం లాగానే భక్తులు స్వామిని దర్శించుకుని తమ కోరికలను మొక్కుబడును చెల్లించుకుంటున్నారు ఈ కార్యక్రమానికి అన్నదానం దాత. తాటి త్రినేష్ రెడ్డి కావ్య దంపతులు. హుజూర్ నగర్ వాస్తవ్యులు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నో కష్టాలతో బాధలతో ఇబ్బందులతో భక్తులు ఇంటి నుండి బయలుదేరి స్వామి వారి సన్నిధికి వచ్చాక వాటినన్నిటిని మర్చిపోయి ఎంతో సంతోషం ఇక్కడ కలుగుతుందని వారు తెలియజేశారు ఆలయ కమిటీ వారు మాట్లాడుతూ భక్తులు ఎండల్ని దృష్టిలో ఉంచుకొని తగు జాగ్రత్తలు తీసుకొని స్వామివారి సన్నిధికి రావాలని స్వామివారి కృప కు పాత్రులు కావాలని అదేవిధంగా ఆలయ అభివృద్ధికి ప్రతి ఒక్కరు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని వారు తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు శాగం రెడ్డి కృష్ణారెడ్డి ప్రధాన కార్యదర్శి పొనుగుపాటి వెంకటేశ్వరరావు కోశాధికారి గుర్రం చిన్న వెంకటరెడ్డి ఉపాధ్యక్షులు తోడేటి సర్వయ్య వీరవల్లి గురునాథం శంకరమ్మ కోటేశ్వరరావు అమరోజ్ నాగరాజ్ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## గుంటూరు టూ ఉపరాష్ట్రపతి భవన్

**జయభేరి, న్యూఢిల్లీ, మే 22 :**

గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గల్లా మాధవి తన నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల పట్ల చూపిన చొరవ ఇప్పుడు ప్రశంసలందుకుంటోంది. పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఆమె ఏకంగా వారిని విమానంలో ఢిల్లీకి తీసుకెళ్లి, దేశ ఉపరాష్ట్రపతితో సమావేశపరిచారు. పదో తరగతిలో టాప్ మార్కులు సాధించిన విద్యార్థులకు సాధారణంగా నగదు బహుమతులు ఇవ్వడం చూస్తుంటాం. కానీ, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి మాత్రం వినూత్నంగా ఆలోచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుని, కటిక పేదరికంలోనూ పట్టుదలతో మంచి మార్కులు సాధించిన విద్యార్థులను విమానంలో ఢిల్లీకి తీసుకెళ్లారు. తమ జీవితంలో కనీసం విమానం ఎక్కుతామని కూడా ఊహించని ఆ నిరుపేద విద్యార్థులకు ఇదొక మధుర జ్ఞాపకంగా నిలిచిపోయింది. దేశ రాజధానిలో విమానం దిగిన విద్యార్థులకు ఎమ్మెల్యే స్వయంగా దగ్గరుండి అన్ని ప్రాంతాలను చూపిస్తూ ప్రోత్సహించారు.

ఈ పర్యటనలో అత్యంత కీలక ఘట్టం దేశ ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ తో విద్యార్థుల సమావేశం. ఉపరాష్ట్రపతి భవన్‌లో విద్యార్థులతో ఆయన ముఖాముఖి మాట్లాడారు. వారి కష్టపడే తత్వాన్ని, పట్టుదలను ఆయన అభినందించారు. ఒక సామాన్య రైతు బిడ్డగా తాను కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకుని నేడు ఈ స్థాయికి చేరుకున్నానని, మీరు కూడా కష్టపడితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని వారికి దిశానిర్దేశం చేశారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు ఆయన ఓపికగా సమాధానమిస్తూ, వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపారు.

ఈ అద్భుతమైన ప్రయాణంపై కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ స్పందిస్తూ భావోద్వేగపూరితమైన ట్వీట్ చేశారు. మీరు ఎక్కడి నుంచి వచ్చారనేది కాదు.. ఎంత ఎత్తుకు ఎదగాలనుకుంటున్నారనేదే ముఖ్యం అంటూ విద్యార్థులను కొనియాడారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ఈ ప్రయాణం ఒక గొప్ప ప్రేరణను ఇస్తోందని, వారి కలలు నిజం చేయడంలో తమ వంతు సహకారం అందించడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. పెద్ద కలలు కనాలని, కష్టపడి పనిచేస్తే విజయమే మీ కలలను నిజం చేస్తుందని ఆయన విద్యార్థులకు పిలుపునిచ్చారు. రాజకీయాలకే పరిమితం కాకుండా, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ప్రోత్సహించడానికి గల్లా మాధవి తీసుకున్న ఈ నిర్ణయంపై సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. నారా లోకేష్ కూడా అభినందనలు తెలిపారు.

## గర్భం దాల్చిన టెన్త్ క్లాస్ అమ్మాయి..

**జయభేరి, హైదరాబాద్, మే 22 :**

రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మండలంలో పదో తరగతి చదివిన ఒక మైనర్ గిరిజన విద్యార్థిని గర్భం దాల్చిన ఉదంతం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు తక్షణమే స్పందించి చట్టపరమైన చర్యలు చేపట్టారు. బాధితురాలు ఆమనగల్లు మండలంలోని మేడిగడ్డ గ్రామానికి చెందిన గిరిజన బాలిక. ఆమె ఆమనగల్లులోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఇటీవలే పదో తరగతి పూర్తి చేసింది.పదో తరగతి పరీక్ష ఫలితాలు విడుదలైన అనంతరం, సదరు బాలిక ప్రస్తుతం తొమ్మిది నెలల గర్భవతి అనే విషయం వెలుగులోకి వచ్చింది. అదే గ్రామానికి చెందిన ఒక యువకుడి కారణంగా ఆమె గర్భం దాల్చించి. ఈ విషయం బయటకు రావడంతో గ్రామంలోని కుల పెద్దలు మొదట పంచాయితీ సైతం నిర్వహించినట్లు సమాచారం. అయితే, మైనర్ బాలిక గర్భం దాల్చిన ఉదంతంపై సమాచారం అందగానే పోలీసులు రంగంలోకి దిగారు. బాలిక మైనర్ కావడంతో నిందితుడిపై కఠినమైన పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి, అతడిని అరెస్టు చేశారు. బాధితురాలైన బాలికకు రక్షణ, వైద్య సంరక్షణ కల్పించేందుకు గాను అధికారులు ఆమెను హైదరాబాద్‌లోని ప్రభుత్వ కేర్ టేకర్ హోమ్‌కు తరలించారు.



## సైబర్ నేరగాళ్ల వలలో శిరివెళ్ల

- అప్రమత్తం చేస్తున్న పోలీసులు
- నిర్లక్ష్యం వహిస్తున్న బ్యాంకు మేనేజర్లు.

**జయభేరి, శిరివెళ్ల మే 22 :**

సైబర్ నేరగాళ్లు రకరకాల కుయుక్తులతో కుట్రలతో టెక్నాలజీని అడ్డుపెట్టుకొని ఇతరుల బ్యాంకు ఖాతాల నుండి నగదును సులువుగా ఈజీగా తమ ఖాతాలకు జమ చేసుకుంటున్న సంఘటనలు ఆయా బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ల నిర్లక్ష్యాన్ని అలసత్వాన్ని వేలెత్తి చూపుతున్నాయి. బ్యాంకుల్లో నగదు దాచుకున్న లావాదేవీలు జరుపుకున్న సేఫ్టీ ఉన్నట్లా లేనట్లా అని పలువురు అయోమయం వ్యక్తం చేస్తున్నారు. ఖాతాదారులు బ్యాంకు కి వెళితే సవాలక్ష డాక్యుమెంట్లు కావాలంటూ పాన్ కార్డు ఆధార్ కార్డు పాస్ బుక్ తంబు ఐరిస్ వంటి ఆధారాలు కావాలని బ్యాంకు ఖాతాదారునికి చెబుతూ లావాదేవీలలో ముప్పు తిప్పలు పెడుతున్న బ్యాంక్ మేనేజర్లు ఈ సైబర్ నేరగాళ్లకు సులువుగా ఎలా నగదు దారా దత్తం చేస్తున్నారని పలువురు ఘాటుగా విమర్శిస్తున్నారు. సిరివెళ్ల మండల కేంద్రం లోని బీజాబీర్ అను యువకుడు తను ఫోన్ పే నుండి ఇతరులకు పంపకుండా నే నేరుగా తన ఖాతా నుండి నగదు డెబిట్ అయినట్లు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.హ సిరివెళ్ల యూనియన్ బ్యాంక్ నుండి తమ నగదు సుమారు 1 లక్ష 5 వేలు పైగా సైబర్ నేరగాళ్లు దోచేశారని ఆవేదన వ్యక్తం చేశారు సదరు విషయమై యూనియన్ బ్యాంక్ వద్దకు మేనేజర్ వద్దకు వెళ్లగా మేనేజర్ దురుసుగా అలసత్వంగా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారని వెళ్లి కంప్లైంట్ ఇచ్చుకపో ఇక్కడ నీకు సంబంధం లేదు. ఫోన్ పే వాడవద్దు అంటూ సమాధానం చెప్పినట్లు వాపోయాడు ఫోన్ పే వాడుతున్నప్పటికీ బ్యాంకు నుండి నగదు ఎలా జమ అయ్యింది ఎక్కడికి వెళ్ళింది ఏ ఖాతాలో ఉన్నది అని అడిగితే సదరు బ్రాంచ్ మేనేజర్ నిర్లక్ష్యపు సమాధానం చెప్పారని అన్నారు తమ ఖాతా నుండి నగదు డెబిట్ క్రెడిట్ కాకుండా హోల్డ్ లో పెట్టాల్సిన బ్యాంకు మేనేజర్ అలసత్వపు సమాధానంతో నష్టపోయిన ఖాతాదారునికి మరింత నష్టపోయే విధంగా సమాధానం చెబుతున్నారని అన్నారు సదరు సైబర్ క్రైమ్ నేరగాళ్లకు చిక్కినటువంటి జాబి సిరివెళ్ల పోలీస్ స్టేషన్లో సైబర్ క్రైమ్ పోలీసులకు సమాచారం అందించినట్లు తెలిపారు ఈ సందర్భంగా జావిద్ మాట్లాడుతూ తాను ట్రాక్టర్ ద్వారా వ్యవసాయం చేస్తున్నానని ఒక రైతు కష్టార్జితాన్ని ఒక బ్రాంచ్ నుండి మరొక ఖాతాకు బదిలీ అవుతుంటే బ్రాంచి మేనేజర్ ఏం చేస్తున్నారని బ్రాంచ్లో సెక్యూరిటీ లేదా అని ప్రశ్నించారు ప్రస్తుతం సిరివెళ్ల మండల వ్యాప్తంగా ఏపీకే ఆప్ లో సోషల్ మీడియాలో హల్చల్ చేస్తున్నాయని వాటిపై క్లిక్ చేసి ఆర్థిక నష్టాలు చెవి చూడరాదని జావిద్ మండల ప్రజలకు తెలియజేశారు. సైబర్ నేరగాళ్లు దోచేసిన సొమ్మును రికవరీ చేసి న్యాయం చేయాలని అధికారులను జావిద్ కోరారు.

## మహారాష్ట్రలో దారుణ ఘటన..!

- మహారాష్ట లో పులి దాడిలో నలుగురు మహిళలు మృతి..!
- ఆకులు ఎరుకోవడానికి వెళ్లిన నలుగురు మహిళలు పులి దాడిలో మృతి .!
- భయాందోళనలో గంజేవాహి అటవీ ప్రాంత ప్రజలు.!



అడవిలో బీడీ ఆకులు ఏరుకోవడానికి వెళ్లిన నలుగురు మహిళలపై ఒకేసారి పులి దాడి చేసి చంపిన సంఘటన మహారాష్ట్రలోని చంద్రపుర్ జిల్లా గంజేవాహి అటవీ ప్రాంతంలో చోటుచేసుకొంది. దీంతో సిందేవహి తాలుకాలోని గ్రామీణ ప్రాంతాల ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఉదయం పెద్ద సంఖ్యలో గ్రామీణ ప్రజలు ఎండిపోయిన బీడీ ఆకులు ఏరుకొనేందుకు అటవీ ప్రాంతంలోకి వెళ్లగా ఉదయం 8 గంటల సమయంలో ఓ పులి మాటువేసి వారిపై దాడి చేసింది దీనితో ఘటనా స్థలంలోనే నలుగురు మహిళలు మృత్యువాత పడ్డారు. మృతులను దాదాజీ మొహర్లే, అనుబాయి దాదాజీ మొహర్లే, సంగీతా సంతోష్ చౌదరీ, సునీతా కౌశిక్ మొహర్లేగా గుర్తించారు. వీరంతా 33 ఏళ్ల నుంచి 45 ఏళ్ల మధ్యవారే...ఈ ఘటన తర్వాత అటవీ ప్రాంతం చుట్టుపక్కల ఉన్న గ్రామాల ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. ఫారెస్ట్ రేంజి అధికారి అంజలీ సాయంకర్ వెంటనే ఘటనా స్థలానికి చేరుకొన్నారు. ఒకేసారి పులి దాడిలో నలుగురు మహిళలు చనిపోవడంతో అటవీ పరిసర ప్రాంత ప్రజలు భయాందోళనకు గురి అవుతున్నారు.

## ఇంద్రకీలాద్రిపై భక్తుల కోలాహలం

- సేవా పథంలో చైర్మన్, అధికారులు

**జయభేరి, విజయవాడ, మే 22:**

ఇంద్రకీలాద్రిపై వేసవి సెలవులు మరియు శుక్రవారం కావడంతో శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానానికి భక్తులు పోటెత్తారు. ఎండ తీవ్రత అధికంగా ఉన్నప్పటికీ, అమ్మవారిని దర్శించుకునేందుకు వేలాది మంది భక్తులు క్యూలైన్లలో బారులు తీరారు. ఈ రద్దీని దృష్టిలో ఉంచుకుని భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా దేవస్థాన చైర్మన్ శ్రీ బొర్రా రాధాకృష్ణ (గాంధీ) మరియు ఇన్చార్జ్ ఈఓ శ్రీ రంగారావు గారు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. క్యూలైన్ల పర్యవేక్షణ: చైర్మన్ శ్రీ బొర్రా రాధాకృష్ణ మరియు ఈఓ శ్రీ రంగారావు గారు రోజంతా భక్తుల మధ్యే ఉండి, క్యూలైన్లను స్వయంగా పర్యవేక్షించారు. భక్తులతో ముచ్చటిస్తూ వారి సమస్యలను తెలుసుకుని, దర్శనం సాఫీగా సాగేలా ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకున్నారు. అంతరాలయ దర్శనం నిలిపివేత: భక్తుల రద్దీ అసాధారణంగా పెరగడంతో, సాధారణ భక్తులకు త్వరితగతిన దర్శనం కల్పించే ఉద్దేశంతో ఉదయం 10 గంటల నుండి అంతరాలయ దర్శనాలను తాత్కాలికంగా నిలిపివేశారు. దీనివల్ల క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు అమ్మవారి దర్శనం వేగంగా లభించింది. వేసవి ఉపశమన చర్యలు: ఎండ వేడి నుండి భక్తులను రక్షించేందుకు క్యూలైన్లలో చల్లని మజ్జిగ, శుద్ధి చేసిన తాగునీటిని నిరంతరాయంగా పంపిణీ చేశారు. ఎక్కడా నీటి కొరత లేకుండా దేవస్థాన సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించారు. అన్నప్రసాద వితరణ: భక్తుల సౌకర్యార్థం రోజంతా ఉచిత అన్నప్రసాద వితరణ మరియు పులిహోర ప్రసాదాల పంపిణీ కొనసాగింది. భక్తులు సంతృప్తి చెందేలా నాణ్యమైన భోజన సదుపాయం కల్పించారు. ట్రస్ట్ బోర్డ్ సభ్యుల సేవలు: ధర్మకర్తల మండలి (ట్రస్ట్ బోర్డ్) సభ్యులు కూడా సామాన్య భక్తుల సేవలో నిమగ్నమయ్యారు. స్వయంగా భక్తులకు నీరు, మజ్జిగ అందిస్తూ సేవా దృక్పథాన్ని చాటుకున్నారు.



# ఏది కావాలి!? యవ్వనమా? వృద్ధాప్యము..!?

**ఓ రాజు, సన్యాసి అద్భుత కథ....**

ఒకసారి ఒక రాజు తన రాజ్యం వెలుపల ఒక చెట్టు క్రింద కూర్చున్న సన్యాసి వద్దకు వెళ్ళాడు. అతనిని కలిసి "ఓ స్వామీ! నేను అమరత్వం పొందగలిగే మూలికా ఔషధం ఏదైనా ఉంటే దయచేసి నాకు తెలియజేయండి" అని అడిగాడు. అప్పుడా సన్యాసి "ఓ రాజా ! దయచేసి మీరు ఎదురుగా ఉన్న రెండు పర్వతాలను దాటండి. అక్కడ మీకు ఒక సరస్సు కనిపిస్తుంది. దాని నీరు త్రాగండి. మీరు అమరత్వం పొందుతారు." అని చెప్పాడు.

రెండు పర్వతాలు దాటిన తర్వాత రాజుకు ఒక సరస్సు కనిపించింది. అతను నీరు తాగడానికి వెళ్ళబోతున్నప్పుడు అతనికి బాధాకరమైన మూలుగులు వినిపించాయి. అతను నీరు తాగకుండా ఆ గొంతును అనుసరించాడు. చాలా బలహీనమైన వ్యక్తి ఒకడు పడుకుని నొప్పితో బాధపడుతున్నాడు. రాజు కారణం అడగగా... "నేను సరస్సులోని నీటిని తాగి అమరుడనయ్యాను. నాకు నూరేళ్లు నిండిన తర్వాత నా కొడుకు నన్ను ఇంటి నుంచి గెంటి వేశాడు.గత యాభై ఏళ్లుగా నన్ను చూసుకునే వారు లేకుండా పడి వున్నాను. నా కొడుకు చనిపోయాడు. నా మనుమలు ఇప్పుడు వృద్ధులయ్యారు. నేను కూడా తినడం మరియు నీరు త్రాగటం మానేశాను. అయినా నేను ఇంకా బ్రతికే ఉన్నాను."

రాజు ఆలోచించాడు... "అమరత్వం, వృద్ధాప్యం యొక్క ప్రయోజనం ఏమిటి?" నేను అమరత్వంతో పాటు యవ్వనం పొందితే? పరిష్కారం కోసం మళ్లీ సన్యాసి దగ్గరకెళ్ళి అడిగాడు. "నాకు అమరత్వంతో పాటు యవ్వనంకూడా లభించే మార్గం తెలపండి" అని... సన్యాసి ఇలా అన్నాడు... "సరస్సు దాటిన తర్వాత మీకు మరొక పర్వతం కనిపిస్తుంది. దాన్ని కూడా దాటండి. అక్కడ మీకు పసుపు రంగు పండ్లతో నిండిన చెట్టు కనిపిస్తుంది, వాటిలో ఒకటి తీసుకుని తినండి. మీరు అమరత్వంతో పాటు యవ్వనం కూడా పొందుతారు." రాజు బయలుదేరి మరో పర్వతాన్ని దాటాడు.అక్కడ అతనికి పసుపు రంగు పండ్లతో నిండిన చెట్టు కనిపించింది. పండ్లను తెంపి తినబోతుంటే... కొందరు గట్టిగా అరుస్తూ పోట్లాడుకోవడం వినిపించింది. ఇంత మారుమూల ప్రదేశంలో ఎవరు పోట్లాడుకుంటారని ఆలోచించాడు.

నలుగురు యువకులు గొంతెత్తి వాదించుకోవడం చూశాడు. అలా వాదించుకుంటూ ఈ మారుమూలలో పోట్లాడుకోవడానికి కారణం ఏమిటని రాజు వాళ్ళని అడిగాడు. వారిలో ఒకరు "నాకు 250 ఏళ్లు, నా కుడి వైపున ఉన్న వ్యక్తికి 300 సంవత్సరాలు. అతను నాకు ఆస్తి ఇవ్వడం లేదు. రాజు సమాధానం కోసం అవతలి వ్యక్తి వైపు చూసినప్పుడు అతను చెప్పాడు..."నా కుడి వైపున మా నాన్న వున్నాడు. అతనికి 350 సంవత్సరాల వయస్సు. అతను తన ఆస్తిని నాకు ఇవ్వనప్పుడు, నేను నా కొడుకుకు ఎలా ఇస్తాను? ఆ వ్యక్తి అదే ఫిర్యాదును కలిగి వున్న 400 సంవత్సరాల వయస్సు గల అతని తండ్రిని సూచించాడు. ఆస్తి కోసం అంతులేని మా పోరాటాలను చూసి తట్టుకోలేక మా గ్రామ ప్రజలు మమ్మల్ని గ్రామం నుండి వెళ్లగొట్టారని వారందరూ రాజుతో చెప్పారు.

రాజు దిగ్భ్రాంతికి గురై సన్యాసి వద్దకు తిరిగి వచ్చి... "మరణం యొక్క ప్రాముఖ్యతను నాకు తెలియచేసినందుకు ధన్యవాదాలు" అన్నాడు.

అపుడు ఆ సన్యాసి ఇలా అన్నారు...

మరణం ఉంది కాబట్టే ప్రపంచంలో ప్రేమ ఉంది "మరణాన్ని నివారించే బదులు, మీరు ప్రతిరోజూ, ప్రతి క్షణం సంతోషంగా జీవించండి. మిమ్మల్ని మీరు మార్చుకోండి. అపుడు ప్రపంచం మారుతుంది.

1. మీరు స్నానం చేసేటప్పుడు భగవంతుని నామాన్ని జపిస్తే అది తీర్థ స్నానం (పవిత్ర స్నానం) లాగా ఉంటుంది. 2. ఆహారం తినేటప్పుడు జపం చేస్తే ప్రసాదం అవుతుంది. 3. నడిచేటప్పుడు జపిస్తే అది తీర్థయాత్ర లాగా ఉంటుంది. 4. ఆహారం వండేటప్పుడు జపం చేస్తే మహా ప్రసాదం అవుతుంది. 5. నిద్రించే ముందు జపం చేస్తే ధ్యాన నిద్ర లాగా ఉంటుంది. 6. పనిచేసేటప్పుడు జపిస్తే అది భక్తి అవుతుంది. 7.ఇంట్లో జపిస్తే ఇల్లే దేవాలయం అవుతుంది.

## పీఎంజీఎస్‌పై పనులకు తెలంగాణకు మరిన్ని అనుమతులు, నిధులు ఇవ్వాలి

- మంత్రి సీతక్క
- రాష్ట్రాలపై 40 శాతం భారం వేయకుండా, గతంలో మాదిరిగా 100% నిధులను కేంద్ర ప్రభుత్వమే భరించాలి
- ఏజెన్సీ ప్రాంతాల్లో అటవీ, వన్యప్రాణి చట్టాల వల్ల పనులు ఆలస్యం అవుతున్నాయి
- ఆదివాసీల అభివృద్ధికి అడ్డుగా ఉన్న చట్టాలను సవరించాలి
- దక్షిణాది రాష్ట్రాల PMGSY ప్రాంతీయ సమావేశంలో మంత్రి సీతక్క విజ్ఞప్తి
- సానుకూలంగా స్పందించిన కేంద్ర ప్రతినిధులు
- కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి తగిన పరిష్కారం చూపిస్తామని వెల్లడి



**జయభేరి, హైదరాబాద్ :**

ప్రధాన్ మంత్రి గ్రామ సడక్ యోజన (PMGSY) కింద తెలంగాణకు మరిన్ని రహదారి పనులు మంజూరు చేయాలని, ముఖ్యంగా ఆదివాసి గిరిజన మారుమూల ప్రాంతాల్లో రహదారి అనుసంధానానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. హైదరాబాద్‌ల దక్షిణాది రాష్ట్రాల PMGSY ప్రాంతీయ సమావేశంలో మంత్రి సీతక్క పాల్గొని రాష్ట్ర సమస్యలు, అవసరాలను కేంద్ర ప్రభుత్వ ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమావేశంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సంయుక్త కార్యదర్శి అతిథి సింగ్, ఎన్ఆర్ఐడీఏ డైరెక్టర్ జనరల్, దక్షిణాది రాష్ట్రాల అధికారులు, ENC లు, CE లు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. గత 25 ఏళ్లుగా PMGSY గ్రామీణ ప్రాంతాల్లో విద్య, వైద్యం, ఉపాధి, మార్కెట్లకు రాకపోకలను మెరుగుపరిచిందన్నారు. ప్రస్తుతం ఈ పథకం మారుమూల గ్రామాలు, ఆదివాసి గిరిజన గూడెలను, మైదాన ప్రాంతాలతో అనుసంధానం చేస్తుంది అన్నారు.

అయితే గతంలో ప్రధానమంత్రి గ్రామీణ యోజన పథకానికి 100% నిధులను కేంద్ర ప్రభుత్వమే భరించేదని, కానీ కేంద్ర ప్రభుత్వం నిబంధనలు మార్చి రాష్ట్రాలపై 40 శాతం భారం వేస్తోందని, ఆ విధానాన్ని పునఃసమీక్షించాలని కోరారు. ఆర్థికంగా వెనుకబడిన, భౌగోళికంగా క్లిష్టమైన ప్రాంతాల రాష్ట్రాలకు ప్రత్యేక సడలింపులు అవసరమని తెలిపారు. ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఆదిలాబాద్ ఆసిఫాబాద్ వంటి ఆదివాసి, గిరిజన ప్రాంతాల్లో అటవీ, వన్యప్రాణి చట్టాల కారణంగా రోడ్డు పనులకు అనుమతులు ఆలస్యమవుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. గిరిజనాభివృద్ధి, గ్రామీణ రవాణా సౌకర్యాల దృష్ట్యా అటవీ, వన్యప్రాణి నిబంధనల్లో అనుకూల మార్పులు చేయాలని కేంద్రాన్ని కోరారు. అప్పటికే ఉన్న పాత రహదారులు, కల్వర్టులు దెబ్బతిన్న ప్రాంతాల్లో పునర్నిర్మాణం, అప్‌గ్రేడేషన్ పనులకు కూడా అటవీ నిబంధనలు అడ్డంకిగా మారాయన, ఆయా పనులకు సులభంగా అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అటవీ సంరక్షణ చట్టాల్లో ఈ మధ్య తెచ్చిన మార్పులు ఆదివాసీల అభివృద్ధికి అటంకంగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని, నాణ్యమైన రోడ్ల నిర్మాణం, నిర్వహణలో ఆధునిక సాంకేతికతలను వినియోగిస్తోందని మంత్రి తెలిపారు. గ్రామీణ రహదారుల నిర్వహణ కోసం హైబ్రిడ్ యాన్యుటీ మోడల్‌ను రాష్ట్రం అమలు చేస్తోందన్నారు. PMGSY4 కింద తెలంగాణలో ఇంకా అనేక ప్రాంతాలకు రోడ్డు అనుసంధానం అవసరమని, మార్కెట్లు, పాఠశాలలు, ఆస్పత్రులు, అభివృద్ధి కేంద్రాలకు గ్రామీణ ప్రజలు సులభంగా చేరుకునేలా మరిన్ని పనులు మంజూరు చేయాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖను కోరారు. మంత్రి చేసిన విజ్ఞప్తులపై కేంద్ర ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తావించిన అంశాలు, అభిప్రాయాలు, అభ్యంతరాలను కేంద్ర ప్రభుత్వానికి నివేదిస్తామని కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ సెక్రెటరీ అతిథి సింగ్ తెలిపారు. అటవీ, వన్యప్రాణి చట్టాల కారణంగా ఎదురవుతున్న సమస్యలపై కేంద్ర స్థాయిలో చర్చించి, పనుల వేగవంతానికి తీసుకోవాల్సిన చర్యలను పరిశీలిస్తామని పేర్కొన్నారు. ప్రత్యేక అనుమతుల మంజూరు అంశాన్ని కూడా పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.

## ఖమ్మం ఇన్సూరెన్స్ కోసం భార్యని హత్య చేసిన భర్త

- ఇంటిపై 80 లక్షలు లోను
- భార్య పేరు మీద కోటి రూపాయల ఇన్సూరెన్స్
- భార్యను కింద పడేసి పిడిగుద్దులతో హింసించిన భర్త
- ఆమెకు పెళ్లి కాకముందే తండ్రి మృతి
- దూరంగా బతుకుతున్న తల్లి
- పెళ్లి చేసిన మేనమామలు
- సుమారు 14 సంవత్సరాల క్రితం వివాహం
- మృతురాలికి ఇద్దరు పిల్లలు

**జయభేరి, ఖమ్మం :**

ఇన్సూరెన్స్ డబ్బుల కోసం కట్టుకున్న భార్యను దారుణంగా కొట్టి హత్య చేసి ఉరి వేసుకున్నట్లు చిత్రీకరించి ప్రయత్నించినా ఘటన ఖమ్మం జిల్లాలో సంచలనం సృష్టించింది.ప్రేమించి పెళ్లి చేసుకున్న భర్తే కాలయముడుగా మారాడు.ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం పాతర్లపాడు స్టేజి దగ్గర లోని గోల్ తండాలో ఈ విషాద ఘటన చోటు చేసుకుంది.భార్యని చిత్రహింసలు పెట్టి భర్త హత్య చేశారు. మీనాక్షి, శివాజీ భార్యాభర్తలు, అయితే శివాజీ కరెంటు కాంట్రాక్టర్ పనులు చేస్తూ భార్య గృహిణిగా ఉన్నారు.శివాజీ తన భార్య పేరు మీదే కాంట్రాక్టర్ రిజిస్ట్రేషన్ చేసి పనులు చేస్తున్నారు. శివాజీ భార్య మీనాక్షిని ప్రేమించి పెళ్లి చేసుకున్నారు.భార్య మీనాక్షికి అంతకుముందు వేరే అతనితో పెళ్లి అయింది. కానీ అతనిని వదిలేసి మరి ప్రేమించిన వ్యక్తి శివాజీతో వివాహం చేసుకొని జీవిస్తుంది. వీరిద్దరి మధ్య గత కొంత కాలంగా తరచూ గొడవలు జరిగేవి.ఆ సమయంలో శివాజీ క్రూరంగా ప్రవర్తిస్తూ భార్య మీనాక్షిని అనేక రకాలుగా చిత్ర హింసలు పెడుతూ అప్పుడప్పుడు కొడుతూ ఉండేవాడని బంధువులు చెబుతున్నారు.భార్య మీనాక్షి పేరు మీద 80 లక్షల రూపాయల ఇల్లు , దానిపై కోటి రూపాయల ఇన్సూరెన్స్ ఉందని స్థానికులు చెబుతున్నారు.ఆమెను చంపితే హౌస్ లోన్ మాఫీ అవుతుంది అదేవిధంగా ఇన్సూరెన్స్ వస్తుందని. ఆలోచనని మనసులో పెట్టుకొని ఆమెను చిత్రహింసలు పెడుతూ...నిన్ను చంపితే నాకు ఇన్సూరెన్స్ వస్తుంది హౌస్ లోన్ కూడా మాఫీ అవుతుందని తరచూ ఆమెతో అనేవాడని స్థానికులు చెబుతున్నారు. ఆమెను హత్య చేసి ఉరేసుకున్నట్టుగా చిత్రీకరించి నిందితుడు పరారయ్యాడు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



## 60 ఏళ్ల తర్వాత తమిళ సర్కార్ లో కాంగ్రెస్ మంత్రులు

**జయభేరి, చెన్నై, మే 22 :**

తమిళనాడు రాజకీయాల్లో కీలక పరిణామం.. 60 ఏళ్ల తర్వాత కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కేబినెట్ లోకి వచ్చింది. ఆరు దశాబ్దాల నుంచి నెలకొన్న నిరీక్షణ ఇప్పట్లో సాధ్యమవుతుంది అని కాంగ్రెస్ కూడా అనుకోలేదు. ఇన్నాళ్లు అధికారంలో ఉన్న పార్టీతో మిత్రపక్షంగా ఉన్నా కూడా కేబినెట్ లో చోటు దక్కని కాంగ్రెస్ కు ఇప్పుడు అనూహ్యంగా మంత్రివర్గంలో చోటు దక్కింది. ఇంతకీ అంత సుదీర్ఘమైన గ్యాప్ ఎందుకొచ్చింది..?తమిళనాడులో అంతకుముందు ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో కాంగ్రెస్ చాలా కాలం ప్రభుత్వాలు ఏర్పాటు చేసి పాలించింది. 1967లో ద్రవిడ వాద సిద్ధాంతాలతో ఏర్పాటైన డీఎంకే పార్టీ అధికారంలోకి వచ్చింది. అప్పటినుంచి కాంగ్రెస్ ఇప్పటివరకు ఒక్కసారి కూడా అధికారంలోకి వచ్చే పరిస్థితి కాదు కదా సొంతంగా పోటీ చేసే సాహసం కూడా చేయలేని పరిస్థితి. అయితే డీఎంకే తో కలిసి సుదీర్ఘకాలం మిత్రపక్షంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ అనేకసార్లు అధికారంలో డీఎంకే కూటమి ఉన్న కూడా మంత్రివర్గంలో పనిచేసే అవకాశం దక్కలేదు. దాదాపు 59 సంవత్సరాల పాటు ఇటు డీఎంకే కాకపోతే అన్నా డీఎంకేతో మిత్రపక్షంగా మెలిగిన తమిళనాడులో కాంగ్రెస్ కు ప్రభుత్వంలో భాగస్వామ్యం మాత్రం దక్కలేదు.ఆరు దశాబ్దాలలో డీఎంకేతోనే కాంగ్రెస్ పార్టీ ఎక్కువ రోజులు ప్రయాణం చేసింది. కేంద్రంలో కాంగ్రెస్ మిత్రపక్షంగా ఉన్న డీఎంకే కేంద్ర మంత్రివర్గంలో మాత్రం పదవులు తీసుకుంది. కానీ రాష్ట్రానికి వచ్చేసరికి మాత్రం మంత్రివర్గంలో కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇవ్వలేదు. మిత్రపక్షంగా మిగిలిపోయిన కాంగ్రెస్ పార్టీ ద్రవిడ పార్టీలను గట్టిగా మంత్రి పదవులు అడిగే సాహసం కూడా చేయలేకపోయింది. విజయ్ పార్టీ స్థాపించాక కాంగ్రెస్ పార్టీకి అలాగే తమిళ పార్టీలకు ఓపెన్ ఆఫర్ ఇచ్చారు. తనతో కలిసి వచ్చే పార్టీలకు అధికార భాగస్వామి కల్పిస్తామని క్యాబినెట్లో మంత్రి పదవులు ఇస్తామని ఆఫర్ చేశారు.అయితే తమిళ పార్టీలు విజయ్ ఆఫర్ ను సీరియస్ గా తీసుకోలేదు. కాంగ్రెస్ పార్టీ మాత్రం విజయ ఆఫర్ కు అట్రాక్ట్ అయింది. ఎన్నికలకు ముందే విజయ్ పొత్తు కోసం రాష్ట్ర కాంగ్రెస్ ప్రయత్నాలు చేసింది. కాంగ్రెస్ అధిష్టానం తో కూడా చర్చలు జరిపిన అప్పట్లో అది సాధ్యపడలేదు. ఎన్నికల ఫలితాల తర్వాత నంబర్ గేమ్ లో భాగంగా కాంగ్రెస్ అవసరం ఏర్పడడంతో మంత్రివర్గంలో చోటు కల్పిస్తామన్న ముందే విజయ్ ఇచ్చిన ఆఫర్ ఈ విధంగా కలిసి వచ్చింది. కాంగ్రెస్ పార్టీ నుంచి ఐదుగురు ఎమ్మెల్యేలు గెలుపొందగా వారిలో ఇద్దరికీ మంత్రివర్గంలో అధిష్టానం ఆకాశం కల్పించింది. రాజేష్ కుమార్, పి విశ్వనాథన్ లు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు.. దీంతో 59 ఏళ్ల తర్వాత అది కూడా విజయ్ ఇచ్చిన అవకాశం తో కాంగ్రెస్ తమిళనాడు కేబినెట్ లోకి అడుగుపెట్టగలిగింది.




# ఉప్పల్‌లో సన్‌రైజర్స్ జయభేరి

ఐపీఎల్ 19వ సీజన్ లీగ్ దశను సన్‌రైజర్స్ హైదరాబాద్ విజయంతో ముగించింది. ఇషాన్ కిషన్ (46 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్సర్లతో 79), అభిషేక్ శర్మ (22 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్సర్లతో 56), హెన్రిచ్ క్లాసెన్ (24 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్సర్లతో 51) విజృంభించడంతో ఉప్పల్ స్టేడియంలో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో 55 పరుగుల తేడాతో ఆర్సీబీని ఓడించింది. తొలుత హైదరాబాద్ 255/4 స్కోరు చేసింది. ఆర్సీబీ బౌలర్లలో భువనేశ్వర్ సహా ముగ్గురు 50 ప్లస్ రన్స్ ఇచ్చుకున్నారు. అనంతరం ఛేదనలో ఆర్సీబీ ఓవర్లన్నీ ఆడి 200/4 చేసి ఓడింది. కెప్టెన్ రజత్ పాటిదార్ (39 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్‌తో 56), వెంకటేశ్ అయ్యర్ (19 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సర్లతో 44) జట్టు భారీ తేడాతో ఓడిపోకుండా చూసి టాప్ ప్లేస్ ఖాయం చేశారు. ఇషాన్‌కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభించింది. ఆర్సీబీ, గుజరాత్, హైదరాబాద్ తలో 18 పాయింట్లతో నిలిచినా.. రన్‌రేట్‌లో వెనుకబడిన హైదరాబాద్ మూడో స్థానానికి పరిమితం అయింది. ఆర్సీబీ, జీటీ ఈ నెల 26న క్వాలిఫయర్ 1 ఆడనుండగా.. నాలుగో స్థానంలో నిలిచే జట్టుతో 27న రైజర్స్ ఎలిమినేటర్‌లో పోటీ పడుతుంది.

నాలుగో ఓవర్లో నాలుగు ఫోర్లు కొట్టిన మరో ఓపెనర్ ట్రావిస్ హెడ్ (26)ను రసిఖ్ ధార్ ఓ యార్కర్‌తో క్లీన్ బౌల్డ్ చేసి ఆర్సీబీ బ్రేక్ ఇచ్చాడు. రసిఖ్ తర్వాతి ఓవర్లో ఇచ్చిన క్యాచ్‌ను వెంకటేశ్ అయ్యర్ డ్రాప్ చేయడంతో బతికిపోయిన అభి.. ఈ చాన్స్‌ను సద్వినియోగం చేసుకున్నాడు. 63/1తో పవర్ ప్లే ముగిసిన తర్వాత ఓ ఎండ్‌లో ఇషాన్‌ను నిలబెట్టి భారీ షాట్లతో విజృంభించాడు. స్పిన్నర్ సుయాశ్, పేసర్ రొమారియోను టార్గెట్ చేసి రెండేసి సిక్సర్లు కొట్టిన అతను 20 బంతుల్లో అర్ధ శతకం అందుకున్నాడు.

సుయాశ్ వేసిన తొమ్మిదో ఓవర్లో మరో షాట్‌కు ప్రయత్నించి జోర్డన్ కాక్స్‌కు క్యాచ్ ఇచ్చినా ఆర్సీబీకి పెద్దగా ఉపశమనం దక్కలేదు. అదే ఓవర్‌లో ఫోర్‌తో స్కోరు వంద దాటించిన ఇషాన్‌తో పాటు క్లాసెన్ ఇన్నింగ్స్‌ను ముందుకు తీసుకెళ్లే బాధ్యత తీసుకున్నారు. సూపర్ ఫామ్‌లో ఉన్న క్లాసెన్.. హేజిల్‌వుడ్ వేసిన 13వ ఓవర్లో మూడు సిక్సర్లు, ఓ ఫోర్‌తో రెచ్చిపోయిన ఏకంగా 27 రన్స్ రాబట్టి స్కోరు 150 దాటించాడు. మరో ఎండ్‌లో ఇషాన్ కూడా భారీ షాట్లు కొడుతూ 31 బంతుల్లో ఫిఫ్టీ మార్కు దాటాడు. తర్వాత మరింత జోరు పెంచిన అతను రసిఖ్ బౌలింగ్‌లో 6, 4, 4 కొట్టగా.. తన ధాటిని కొనసాగించిన క్లాసెన్ 23 బంతుల్లోనే హాఫ్ సెంచరీ అందుకున్నాడు. వీళ్ల జోరుకు 16 ఓవర్లకే స్కోరు 200 దాటింది. తర్వాతి ఓవర్లో స్పిన్నర్ కృనాల్ పాండ్యా.. క్లాసెన్‌ను ఔట్ చేసి రెండో మూడో వికెట్‌కు 113 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని ముగించాడు. కానీ, తర్వాతి రెండు బాల్స్‌ను స్టాండ్స్‌కు పంపిన నితీశ్ (29*) హేజిల్‌వుడ్ ఓవర్లో మరో సిక్స్‌తో అలరించాడు. చివరి రెండు ఓవర్లలో ఆర్సీబీ బౌలర్లు వరుసగా 8, 9 పరుగులే ఇచ్చి ఆఖరి బంతికి ఇషాన్‌ను ఔట్ చేసినా హైదరాబాద్ 250 మార్కు దాటింది.

భారీ లక్ష్య ఛేదనలో ఆర్సీబీని 166 పరుగుల్లోపు కట్టడి చేస్తే టాప్2లో నిలిచే అవకాశం ఉన్నా.. రైజర్స్‌కు ప్రత్యర్థి ఆ చాన్స్ ఇవ్వలేదు. ఛేదనను బెంగళూరు ధాటిగానే ఆరంభించింది. తొలి ఓవర్లోనే కమిన్స్‌కు ఫోర్, సిక్స్‌తో స్వాగతం పలికిన ఓపెనర్ వెంకటేశ్ అయ్యర్ పవర్ ప్లేలో మెరుపులు మెరిపించాడు. స్పిన్నర్ శివంగ్ వేసిన నాలుగో ఓవర్లో 6,4,6,6తో చెలరేగి స్కోరు యాభై దాటించాడు. కానీ, తర్వాతి ఓవర్లో మళ్లీ బౌలింగ్‌కు వచ్చిన ఈషాన్ మలింగ అతడిని ఔట్ చేసి ఆర్సీబీని తొలి దెబ్బకొట్టాడు. తర్వాతి ఓవర్లో విరాట్ కోహ్లీ (15)ని సాకిబ్ పెవిలియన్ చేర్చడంతో అతని ఫ్యాన్స్ అంతా షాకయ్యారు. రెండు ఫోర్లు, ఓ సిక్స్‌తో దూకుడుగా ఆడుతున్న పడిక్కల్ (21)ను తొమ్మిదో ఓవర్లో మలింగ పెవిలియన్ చేర్చడంతో ఆర్సీబీ 94/3తో నిలిచింది. ఇక్కడి నుంచి ఆతిథ్య బౌల కట్టుదిట్టమైన బంతులు వేయడంతో కెప్టెన్ రజత్, కృనాల్ పాండ్యా (41 నాటౌట్) వేగంగా ఆడలేకపోయారు. ఫలితంగా సాధించాల్సిన రన్‌రేట్ భారీగా పెరిగింది. ఒత్తిడిలోనూ క్రమం తప్పకుండా బౌండరీలు కొట్టిన రజత్ అర్ధ శతకం పూర్తి చేసుకున్నాడు. జట్టు టాప్ ప్లేస్‌ను ఖాయం చేసిన తర్వాత 19వ ఓవర్లో పార్ట్‌టైమ్ స్పిన్నర్ హెడ్‌కు వికెట్ ఇచ్చుకున్నాడు. చివరి ఓవర్లో 6,4 కొట్టిన టిమ్ డేవిడ్ (15 నాటౌట్) స్కోరు 200 దాటించాడు.

9 ఐపీఎల్‌లో భువనేశ్వర్ ఓ ఇన్నింగ్స్‌లో 50 ప్లస్ రన్స్ ఇచ్చుకోవడం ఇది అత్యధికంగా తొమ్మిదోసారి. షమీ రికార్డును సమం చేశాడు.

6 ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ 250 ప్లస్ స్కోరు చేయడం ఇది అత్యధికంగా ఆరోసారి.

**సంక్షిప్త స్కోర్లు**

సన్‌రైజర్స్: 20 ఓవర్లలో 255/4 (ఇషాన్ 79, అభిషేక్ 56, క్లాసెన్ 56, రసిఖ్ దార్ 2/52);
బెంగళూరు: 20 ఓవర్లలో 200/4 (రజత్ 56, వెంకటేశ్ 44, ఈషాన్ మలింగ 2/33)



# ఐపీఎల్‌లో 'ధోనీ స్కామ్'..

### అభిమానులను పిచ్చోళ్లను చేసిన సీఎస్కే..!

ఐపీఎల్ పంతొమ్మిదో సీజన్‌లో ఎంఎస్ ధోనీ ఆటకోసం నిరీక్షించిన అభిమానులకు నిరాశే మిగిలింది. చెన్నై సూపర్ కింగ్స్ ప్లే ఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించడంతో ధోనీ ఆడుతాడనే ఆశ కూడా ఆవిరైంది. అయితే.. సీజన్ ఆసాంతం మహా భాయ్ ఫిట్‌నెస్‌పై, 'ఇదుగో వస్తుండు.. వచ్చే మ్యాచ్‌లో ఆడే అవకాశముంది' అని అభిమానులను మభ్యపెట్టిన సీఎస్కే యామజమాన్యంపై మాజీ ఆటగాడు క్రిష్ణమాచారి శ్రీకాంత్ మండిపడ్డాడు. పంతొమ్మిదో సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ ధోనీ స్కామ్‌కు తెర తీసిందని ఆయన తీవ్రంగా విమర్శించాడు. లెజెండరీ క్రికెటర్ ఎంఎస్ ధోనీ ఐపీఎల్ పంతొమ్మిదో సీజన్‌లో ఒక్కటంటే ఒక్క మ్యాచ్ ఆడలేదు. గాయం నుంచి కోలుకుంటున్న ధోనీ త్వరలోనే ఫిట్‌నెస్ సాధిస్తాడని, లీగ్ దశ చివర్లో ఆడుతాడని చెన్నై సూపర్ కింగ్స్ కెప్టెన్, కోచ్ చెప్పిన మాటలన్నీ అబద్ధాలని అభిమానులు గ్రహించారు. ఈ విషయంపై మాజీ ఆటగాడు కృష్ణమాచారి శ్రీకాంత్ స్పందిస్తూ 'ధోనీ స్కామ్'కు సీఎస్కే తెర తీసిందని విమర్శించాడు. 'సీజన్ ఆరంభం నుంచి ధోనీ గురించి కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్, కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్‌లు ప్రతిసారి అబద్ధాలు చెబుతూ వచ్చారు. మొదట కాలి గాయంతో ధోనీ బాధ పడుతున్నాడని, అతడు త్వరలోనే జట్టుతో కలవాలని కోరుకుంటున్నామని చెప్పారు. ధోనీ తర్వాతి మ్యాచ్‌కు అందుబాటులో ఉంటాడని చెపాక్‌లో చివరి మ్యాచ్ టాస్ సందర్భంగా గైక్వాడ్ తెలిపాడు. ఆ మ్యాచ్‌కు ముందు నెట్స్‌లో ధోనీ ప్రాక్టీస్ చేస్తున్న వీడియోను సీఎస్కే తమ ఎక్స్ ఖాతాలో పెట్టింది. దాంతో, తాలా కచ్చితంగా సన్‌రైజర్స్‌తో ఆడుతాడని అభిమానులు గంపెడు ఆశలతో మైదానానికి పోటెత్తారు. కానీ, మళ్లీ వారికి నిరాశే మిగిలింది' అని శ్రీకాంత్ యూట్యూబ్ ఛానెల్లో ఆగ్రహం వ్యక్తం చేశాడు. నిజానికి ధోనీని ఎవరూ మిస్ అవ్వడం లేదని పేర్కొన్న శ్రీకాంత్ దిగ్గజ ఆటగాడి గురించి సరైన సమాచారం ఇవ్వాల్సిన యాజమాన్యం అభిమానుల మనోభావాలతో ఆడుకుందని విమర్శించాడు. 'నిజం చెప్పాలంటే ధోనీని ఎవరూ మిస్ కావడం లేదు. ధోనీని ఆడించాలని ఎవరూ కోరడం లేదు. ఎందుకంటే ఐపీఎల్‌లో ధోనీ శకం ముగిసింది. ఐపీఎల్ దిగ్గజ ఆటగాళ్లలో ధోనీ ఒకడు. గొప్ప కెప్టెన్ కూడా. కాబట్టి.. చెన్నై యాజమాన్యం అతడి గురించి నిజాలు చెప్పాల్సింది. కానీ, సీజన్ ఆసాంతం ఇదుగో వస్తున్నాడు అంటూ సీఎస్కే ఫ్రాంచైజీ కోట్లాది మంది అభిమానులను పిచ్చోళ్లను చేసింది' అని శ్రీకాంత్ అసహనంతో రగిలిపోయాడు.



# పొద్దునే ప్రొటీన్ ఫుడ్

పొద్దున నిద్ర లేచిన వేళా విశేషమే రోజంతటినీ నిర్ణయిస్తుంది. పొద్దునే మన టిఫిన్లలో ఇడ్లీ, పోహా, ఉప్మా, ఆలూ పరాఠా లాంటివి ప్రధానంగా ఉంటాయి. ఇవన్నీ కార్బొహైడ్రేట్లతో నిండి ఉంటాయి. కానీ ఆరోగ్యానికి అత్యవసర పోషకమైన ప్రొటీన్ ఉండదు. అయితే, ఉపాహారం నుంచే 20 గ్రాముల ప్రొటీన్ అందేలా చూసుకుంటే మంచిది. అలాగని ప్రొటీన్ పౌడర్ల మీద ఆధారపడకూడదు. ఆహారంలో కొన్ని చిన్న మార్పులు చేసుకుంటే సరిపోతుంది. పొద్దునే ఆరగించడానికి ప్రొటీన్లతో సమృద్ధమైన టిఫిన్లు కొన్నిటి గురించి తెలుసుకుందాం.

శరీర విధులు సాఫీగా సాగాలంటే ప్రొటీన్లు సమృద్ధిగా ఉన్న ఆహారం తీసుకోవాలి. శరీర కణజాలం, కండరాలు, ఎముకలు, చర్మం, వెంట్రుకలు, గోళ్ల నిర్మాణంలో ప్రొటీన్లు కీలకంగా నిలుస్తాయి. ఎంజైముల విడుదలలో ఇవి కీలకపాత్ర పోషిస్తాయి. అంతేకాదు ప్రొటీన్లు మన రోగ నిరోధక వ్యవస్థలో అంతర్భాగం. ప్రొటీన్లు తీసుకుంటూ తగినంత వ్యాయామం చేస్తే ఆరోగ్యకరమైన జీవితం సొంతమవుతుంది. ప్రొటీన్లు శరీరానికి మాత్రమే కాదు మెదడు పనితీరుకు కూడా అండగా నిలుస్తాయి.

#### పల్లీలు కూరగాయలతో క్వినోవా ఉప్మా

ఓ కప్పు క్వినోవాలో 8 గ్రాముల ప్రొటీన్లు ఉంటాయి. దీనికి కూరగాయలు, కరివేపాకు, ఓ టేబుల్ స్పూన్ వేయించిన పల్లీలు, పచ్చి బఠాణీలు కలపాలి.ఉడికించిన శనగలతో సలాడ్ తీసుకుంటే మొత్తం 22 గ్రాముల ప్రొటీన్లు దొరుకుతాయి. ఒక్క క్వినోవా ఉప్మా, కూరగాయలు, పల్లీల నుంచే 17 గ్రాముల ప్రొటీన్లు లభిస్తాయి.

#### శనగపిండి టోస్ట్, టోఫు బుర్జి

రెండు బ్రెడ్ పకోడీలు (శనగపిండితో చేసినవి) తీసుకోవాలి. దీనికి 75 గ్రాముల టోఫు బుర్జీ జతచేయాలి. టమాటాలు, పసుపు, జీలకర్ర కలపాలి. దీని ద్వారా 23 గ్రాముల ప్రొటీన్లు లభిస్తాయి.

#### రాజ్మా పరాఠా, కప్పు పెరుగు

మామూలుగా రాజ్మా లంచ్‌కే అనుకుంటారు. కానీ ఓ కప్పు రాజ్మాను ఉడికించి ముద్దగా చేసుకోవాలి. దాన్ని పరాఠా స్టఫ్‌గా వాడుకోవాలి. ఇలా చేస్తే 15 గ్రాముల ప్రొటీన్ దొరుకుతుంది. దీన్ని పుదీనా, సైంధవ లవణం కలిపిన హంగ్ కర్డ్ (నీళ్లు తీసేసిన పెరుగు)లో అద్దుకుని తినేయాలి.

#### సత్తు పరాఠా, ఉడికించిన గుడ్డు, బటర్ మిల్క్


సత్తు అంటే వేసవి పానీయం మాత్రమే కాదు. 100 గ్రాముల సత్తులో 20 గ్రాముల ప్రొటీన్లు ఉంటాయి. కాబట్టి, కొద్దిగా నెయ్యి వేసి సత్తు పరాఠా చేసుకోవాలి. తినే వాళ్లయితే దీంతోపాటు ఓ ఉడికించిన గుడ్డు తినాలి. గ్లాసెడు బటర్ మిల్క్ తాగాలి. రెండు మోస్తరు సత్తు పరాఠాల నుంచి 14 గ్రాములు, ఉడికించిన గుడ్డు నుంచి 6 గ్రాములు, బటర్‌మిల్క్ నుంచి 2 గ్రాములు.. మొత్తంగా 22 గ్రాముల ప్రొటీన్లు లభిస్తాయి.

#### మూంగ్‌దాల్ చిల్లా పనీర్ ఫిల్లింగ్

ఒక్కో చిల్లా (దోశ లాంటిది)లో 5 6 గ్రాముల ప్రొటీన్లు ఉంటాయి. వీటిలో నింపే 50 గ్రాముల తురిమిన పనీర్ నుంచి 9 గ్రాముల ప్రొటీన్లు లభిస్తాయి. రెండు చిల్లాలను ఓ కప్పు పెరుగుతో లాగించేయాలి. పెరుగుతో లభించే 5 గ్రాములతో కలుపుకొని మొత్తం 26 గ్రాముల ప్రొటీన్లు లభిస్తాయి.

#### మొలక పెసర్లు ఓట్స్ చీలా

ఇది కూడా దోశలా చేసుకునేదే. అరకప్పు ఓట్స్‌లో 5 గ్రాముల ప్రొటీన్ దొరుకుతుంది. దీన్ని ఓ కప్పు పెసర మొలకలతో కలిపితే మరో 14 గ్రాములు లభిస్తాయి. దీనికి కాస్త శనగపిండిని జోడిస్తే మరో 2 గ్రాములు మొత్తంగా 21 గ్రాముల ప్రొటీన్లు దొరుకుతాయి.



# ఒకే సినిమాలోనే 30 లిప్‌లాక్స్!




చిత్ర పరిశ్రమలో కొందరు నటీమణులు తమ మొదటి సినిమాతోనే దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకుంటారు. నటన, గ్లామర్‌తో ప్రేక్షకులను ఆకట్టుకున్నా, ఆ తర్వాత సరైన విజయాలు లేక రేసులో వెనుకబడిపోతుంటారు. ఈ కోవకు చెందిన బాలీవుడ్ బ్యూటీనే సోనాల్ చౌహాన్. చేసింది తక్కువ సినిమాలే అయినా సోషల్ మీడియాలో, సినీ వర్గాల్లో ఈమెకు విపరీతమైన క్రేజ్ ఉంది. అయితే, ఈమె కెరీర్‌లో ఒకే ఒక సినిమా ఏకంగా 30 ముద్దు సీన్ల కారణంగా అప్పట్లో సంచలనంగా మారింది. 1987 మే 16న నోయిడాలో జన్మించిన సోనాల్ చౌహాన్, ఢిల్లీలోని గార్గి కాలేజీలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసింది. 2005లో 'మిస్ వరల్డ్ టూరిజం' టైటిల్‌ను గెలుచుకున్న తొలి ఇండియన్‌గా ఆమె రికార్డు సృష్టించింది. ఆ తర్వాత హిమేష్ రేష్మియా పాపులర్ మ్యూజిక్ ఆల్బమ్ 'ఆప్కా సురూర్'లోని 'సంఝో నా' సాంగ్‌తో అందరి దృష్టిని ఆకర్షించింది. ఈ క్రేజ్‌తో 2008లో ఇమ్రాన్ హష్మీ సరసన 'జన్నత్' సినిమాతో బాలీవుడ్‌లోకి గ్రాండ్‌గా ఎంట్రీ ఇచ్చింది. ఈ సినిమా సూపర్ హిట్ అవ్వడమే కాకుండా, సోనాల్‌ను రాత్రికి రాత్రే 'నేషనల్ క్రష్'గా మార్చేసింది. అయితే, జన్నత్ తెచ్చిన స్టార్‌డమ్ ఎక్కువ కాలం నిలవలేదు. ఆ తర్వాత ఆమెకు బాలీవుడ్‌లో పెద్దగా ఆఫర్లు రాలేదు. ఈ క్రమంలోనే 2013లో ఆమె నీల్ నితిన్ ముఖేష్‌తో కలిసి '3G – ఎ కిల్లర్ కనెక్షన్' అనే హర్రర్ థ్రిల్లర్ చిత్రంలో నటించింది. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఘోర పరాజయాన్ని చవిచూసినప్పటికీ, అందులోని రికార్డు బ్రేకింగ్ బోల్డ్ సీన్స్ వల్ల విపరీతంగా వార్తల్లో నిలిచింది. ఈ ఒక్క సినిమాలోనే ఏకంగా 30 లిప్‌లాక్ సీన్లు ఉండటం అప్పట్లో ఇండస్ట్రీని కుదిపేసింది.




# చీరా చౌక్కా చిక్కడిపోవాలో..

అగ్ర హీరో రామ్‌చరణ్ నటిస్తున్న మోస్ట్ ఎవైటెడ్ పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'పెద్ది' జూన్ 4న విడుదల కానున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఈ సినిమా హ్యూజ్ బజ్‌ని క్రియేట్ చేస్తున్నది. ముఖ్యంగా చికిరీ చికిరీ, రైరైరారా సాంగ్స్ సోషల్ మీడియాలో సంచలనాలుగా మారాయి. ఈ నేపథ్యంలో ఈ సినిమాలోని మూడో పాటను మేకర్స్ నేడు(శనివారం) విడుదల చేయనున్నారు. ఇందులో భాగంగా ఈ పాట ప్రోమోను శుక్రవారం విడుదల చేశారు. 'హెల్లో హెల్లో హెల్లో హెల్లెల్లో.. బావా.. చీరా చౌక్కా చిక్కడిపోవాలో..' అంటూ సాగే ఈ పాటను దర్శకుడు బుచ్చిబాబు సానా అత్యంత ఎనర్జిటిక్‌గా, కలర్‌ఫుల్‌గా చిత్రీకరించినట్టు ప్రోమో చూస్తుంటే తెలుస్తున్నది. పవర్‌ఫుల్ డ్రమ్ బీట్స్, క్యాచీ రిథమ్‌తో జాతర వాతావరణాన్ని తలపించేలా ఈ ప్రోమో సాగింది. రామ్‌చరణ్, శ్రుతిహాసన్, జాన్వీ కపూర్‌లపై ఈ పాటను చిత్రీకరించారు. స్టైలిష్ స్టెప్పులతో, అద్భుతమైన స్క్రీన్ ప్రజెన్స్‌తో ముగ్గురూ ఆకట్టుకున్నారు. శనివారం భోపాల్‌లో జరిగే భారీ మ్యూజికల్ ఈవెంట్‌లో పూర్తి పాటను విడుదల చేస్తారు. శివరాజ్‌కుమార్ కీలక పాత్ర పోషించిన ఈ చిత్రంలో జగపతిబాబు, దివ్యేందుశర్మ, బోమన్ ఇరానీ ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: రత్నవేల్, సహ నిర్మాత: ఇషాన్ సక్సేనా, సమర్పణ: మైత్రీ మూవీమేకర్స్, సుకుమార్ రైటింగ్స్, నిర్మాత: వెంకటసతీశ్ కిలారు, నిర్మాణం: వృద్ధి సినిమాస్.

# పాట చిత్రీకరణలో వారణాసి




దర్శకధీరుడు ఎస్ఎస్ రాజమౌళిని చాలామంది 'జక్కన్న' అని అభిమానంతో పిలుస్తుంటారు. సినిమాను శ్రద్ధగా సమయం తీసుకొని మరీ చెక్కుతారు కాబట్టే ఆయనకు ఆ పేరొచ్చిందని చెబుతుంటారు. అయితే.. తన గత చిత్రాలకు భిన్నంగా 'వారణాసి' షూటింగ్‌ని మాత్రం శరవేగంతో పూర్తి చేస్తున్నారు రాజమౌళి. ప్రీ విజువలైజేషన్, షెడ్యూల్ ప్లానింగ్, మోషన్ క్యాప్చర్ టెక్నాలజీ వినియోగం.. తదితర అంశాల వల్లే షూటింగ్‌లో వేగం పెరిగిందని చిత్రబృందం చెబుతున్నది. ఇటీవలే కాశీలో జరిగిన షెడ్యూల్‌లో అండర్ వాటర్ సీక్వెన్స్‌ని పూర్తి చేసిన రాజమౌళి.. తాజా హైదరాబాద్‌లోని కాటేదాన్ ప్రాంతంలో నిర్మించిన భారీ సెట్‌లో ఓ పాటను షూట్ చేస్తున్నట్టు సమాచారం. గ్లోబల్ లెవల్ అడ్వెంచర్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ చిత్రంలో ఈ పాట కథలోని విజువల్ టర్నింగ్ పాయింట్‌గా ఉంటుందని ఇన్‌సైడ్ టాక్. చిత్ర కథానాయకుడు మహేశ్‌బాబు, కథానాయిక ప్రియాంకచోప్రాతో పాటు కీలక తారాగణం ఈ పాటలో భాగమయ్యారని వినికిడి. ఎంఎం కీరవాణి సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీదుర్గా ఆర్ట్స్ పతాకంపై కేఎల్ నారాయణ, ఎస్ఎస్ కార్తికేయ కలిసి నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 7న సినిమా విడుదల కానున్నది.



# బికినీలో రుక్మిణి వసంత్.. రియలా?

'సప్త సాగరాలు దాటి' సినిమాతో తెలుగు ప్రేక్షకులలో మంచి ఇమేజ్ సంపాదించుకున్న కన్నడ నటి రుక్మిణి వసంత్‌కు సంబంధించిన కొన్ని బికినీ ఫోటోషూట్ క్లిప్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా హల్‌చల్ చేస్తున్నాయి. సాధారణంగా చాలా పద్ధతైన పాత్రల్లో కనిపించే ఈ ముద్దుగుమ్మ, తాజాగా గ్రీన్ కలర్ బికినీ ధరించి స్విమ్మింగ్ పూల్‌లోకి దిగుతున్న విజువల్స్ నెటిజన్లను ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురిచేశాయి. ఈ లీకైన ఫొటోలు, వీడియో క్లిప్స్‌లో ఆమె చుట్టూ కెమెరాలు, టెక్నీషియన్లు మరియు ప్రొడక్షన్ సెటప్ స్పష్టంగా కనిపిస్తుండటంతో ఇది ఏదైనా ప్రముఖ బ్రాండ్ ప్రమోషన్ లేదా ఫ్యాషన్ మ్యాగజైన్ కోసం చేసిన అఫీషియల్ షూట్ అయ్యి ఉంటుందని కొందరు భావిస్తున్నారు. అయితే మరికొందరు మాత్రం ఇది ఏఐ డీప్‌ఫేక్ అయ్యి ఉండవచ్చని అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు. ఈ వైరల్ వీడియోలపై ఇప్పటివరకు నటి రుక్మిణి వసంత్ కానీ, ఆమె టీమ్ కానీ ఎలాంటి అధికారిక ప్రకటన లేదా క్లారిటీ ఇవ్వలేదు. మరోవైపు రుక్మిణి వసంత్ కెరీర్ ప్రస్తుతం పీక్ స్టేజ్‌లో ఉంది. యంగ్ టైగర్ ఎన్టీఆర్‌ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో వస్తున్న 'డ్రాగన్', రాకింగ్ స్టార్ యశ్ 'టాక్సిక్' చిత్రాలతో బిజీగా ఉంది. ఇలాంటి క్రేజీ ప్రాజెక్టులతో దూసుకుపోతున్న సమయంలోనే ఈ బికినీ షూట్ వీడియోలు లీక్ అవ్వడం ఇప్పుడు టాలీవుడ్, శాండల్‌వుడ్ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

# వైవిధ్యమైన పాత్రల చుట్టూ తిరిగే హృదయపూర్వక ప్రేమకథ!



విభిన్నమైన కథాంశాలతో వచ్చే చిత్రాలకు తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ బ్రహ్మరథం పడుతుంటారన్న సంగతి తెలిసిందే. ఆ కోవలోనే, 'నడవలేని ఒక అబ్బాయి, చూపులేని ఒక అమ్మాయి' మధ్య సాగే సరికొత్త ప్రేమకథతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన చిత్రం 'రమణి కళ్యాణం'. సూర్య వశిష్ట, దీప్షిక చంద్రన్ జంటగా నటించిన ఈ సినిమాను విజయ్ ఆదిరెడ్డి దర్శకత్వంలో కైట్స్ క్రియేటివ్స్ బ్యానర్‌పై విజయ్ ఆదిరెడ్డి, మనోజ్ చింతిరెడ్డి, శ్రీనాథ్ పసుపులేటి, సంజయ్ వెంపరాల సంయుక్తంగా నిర్మించారు.

మే 22న ప్రపంచవ్యాప్తంగా విడుదలవుతున్న ఈ చిత్రానికి సంబంధించి, ఒక రోజు ముందే ప్రత్యేక ప్రీమియర్ షోలు ప్రదర్శించారు. సంజన (దీప్షిక) చిన్నతనంలోనే జరిగిన ఒక ప్రమాదంలో కంటిచూపు కోల్పోతుంది. అయినప్పటికీ, తానొక అంధురాలినని ఎక్కడా కుంగిపోకుండా, ఎంతో ఆత్మవిశ్వాసంతో జీవిస్తుంటుంది. కిషోర్ (శ్రీనివాస రెడ్డి) నడుపుతున్న పబ్‌లో సింగర్‌గా, అలాగే ఒక ఎఫ్‌ఎమ్ రేడియోలో ఆర్జేగా పని చేస్తూ.. నలుగురు పిల్లలు, ఒక బామ్మతో కూడిన తన కుటుంబాన్ని పోషిస్తుంటుంది. మరోవైపు, కిషోర్ స్నేహితుడైన రాజ్ (సూర్య వసిష్ఠ) కాళ్లు పడిపోయి వీల్ చైర్‌కే పరిమితమవుతాడు. తన గతాన్ని, ఆశయాలను తలుచుకుంటూ బాధపడే రాజ్ జీవితంలోకి సంజన ప్రవేశిస్తుంది. మొదట్లో చిన్న గొడవతో ప్రారంభమైన వీరి పరిచయం, ఆ తర్వాత ఒకరిపైకొకరికి ఉన్న గౌరవంతో ప్రేమగా మారుతుంది.

సంజన అందించిన స్ఫూర్తితో రాజ్ తన జీవితాన్ని కొత్తగా ప్రారంభించాలనుకుంటాడు. వీరిద్దరూ పెళ్లి పీటలు ఎక్కాలని నిర్ణయించుకున్న తరుణంలో కథ ఎలాంటి మలుపులు తిరిగింది? అసలు రాజ్ వీల్ చైర్‌కే ఎందుకు పరిమితమయ్యాడు? సంజనతో ఉన్న ఆ నలుగురు పిల్లలు ఎవరు? చివరికి వీరి కల్యాణం జరిగిందా లేదా? అనేదే మిగతా కథ. ట్రైలర్, టీజర్లతోనే ఆసక్తి రేకెత్తించిన ఈ చిత్రం, వెండితెరపై కూడా అదే వైవిధ్యాన్ని చూపించే ప్రయత్నం చేసింది. సినిమా ప్రథమార్థం అంతా ప్రధాన పాత్రల పరిచయం, వారి మధ్య చిగురించే ప్రేమ చుట్టూ క్యూట్‌గా సాగుతుంది. ఇంటర్వెల్ లో వచ్చే ఒక భావోద్వేగ సన్నివేశం ద్వితీయార్థంపై ఆసక్తిని పెంచుతుంది.

ఇక సెకండ్ హాఫ్ పూర్తిగా ఎమోషనల్ డ్రామాగా సాగుతుంది. వీరి పెళ్లి జరుగుతుందా లేదా అనే ఉత్కంఠను దర్శకుడు బాగానే నిర్వహించారు. ప్రీక్లైమాక్స్ ట్విస్ట్ ప్రేక్షకులను ఆశ్చర్యపరుస్తుంది. క్లైమాక్స్ సీన్లు మరింత హృదయవిదారకంగా ఉంటాయి. మనుషులకు శారీరక లోపాలు ఉన్నా, వాటిని అధిగమించి జీవితంలో ముందుకు సాగాలనే మంచి సందేశాన్ని ఈ చిత్రం అందిస్తుంది.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at **Sri Muktheswara Publications**, Plot No. 31, Mallikarjuna Nagar Colony, Sagar Ring Road, Bairamal Guda, Hyderabad-500079, Dist. Rangareddy, Telangana. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314.** email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**